ప్రజాశక్తి

ఆదివారం 27 ఆగస్టు 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి కేశినేని నాని

కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోండి

దిశ చైర్మన్, ఎంపి కేశినేని నాని

ప్రజాశక్తి-విజయవాడ : వివిధ పథకాల అమలుకు కేంద్రం మంజూరు చేస్తున్న నిధులను జిల్లా అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్, విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశం మందిరంలో శనివారం జిల్లా ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి కేశినని అధ్యక్షత వహించారు. జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దిశ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశినేని మాట్లాడుతూ తాగునీటి అవసరాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తక్షణమే 300 గ్రామ పంచాయతీలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడం మంచిపరిణామమన్నారు. కొండపల్లి బొమ్మలకు గుర్తింపును తీసుకొచ్చే విధంగా ప్రత్యేక ప్లాట్‌ఫారమ్ ఏర్పాటు చేశామని, ఒక్కో కళాకారుడికి రూ.10 వేల విలువైన టూల్‌కిట్లను 63 మందికి అందించడం అభినందనీయమన్నారు. మున్నేరు నదిపై వంతెన మంజూరైందన్నారు. జిల్లాలోని 16 మండలాల్లో ప్రతి ఒక్కరికీ పనికల్పిస్తూ 72 లక్షల పని దినాలు కల్పించామని, ఉపాధి హామీలో మన జిల్లా రాష్ట్రంలోనే ప్రథమంగా ఉందని ప్రగతి నివేదిక ద్వారా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జె సునీత ఎంపి దృష్టికి తీసుకెళ్లారు. అమృత్ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో 75 చెరువుల్లో పూడిక తీత పనులను పూర్తి చేశామన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా ప్రభుత్వ భవనాలను వేగంగా (మిగతా 6లో)

ఈ క్రాప్‌లో తీవ్ర జాప్యం

❁నమోదులో నూతన పద్ధతి ❁తరచూ సాంకేతిక సమస్యలు

❁కృష్ణాజిల్లాలో సాగు విస్తీర్ణం 3,28,649 ఎకరాలు ❁నమోదు 36,309 ఎకరాలు మాత్రమే

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

జియో రిఫరెన్స్ పద్ధతిలో ఈ క్రాప్ నమోదు ముందుకు సాగడం లేదు. ఈ క్రాప్ నమోదులో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. కృష్ణాజిల్లాలో ఇప్పటి వరకు 3,28,648 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగైతే పదో వంతు విస్తీర్ణం కూడా నమోదు కాలేదు. ఈ నేపథ్యంలోనే కౌలు రైతులకు పంట రుణాల మంజూరులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది.

పంట నష్టపరిహారం, బీమా, పంటల సేకరణ, కౌలు రైతులకు పంట రుణాలు మంజూరుకు ఈక్రాప్ నమోదు తప్పనిసరి. గ్రామాలు, రైతులకు సంబంధించిన వ్యవసాయ భూమి విస్తీర్ణం వివరాలను రెవెన్యూ వెబ్‌లాండ్ నుంచి గ్రామ వ్యవసాయ సహాయకులు (విఎఎలు) డౌన్‌లోడ్ చేసుకునేవారు. పంటల సాగుకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఫొటోలు తీసి, దీనికి వెబ్‌లాండ్ సమాచారాన్ని జోడించి గత ఏడాది వరకు ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం జియో రిఫరెన్సింగ్ పద్ధతిని తీసుకు వచ్చింది. ఈ విధానంలో అక్షాంశ, రేఖాంశాలను ఆధారంగా చేసుకుని వ్యవసాయ భూముల సర్వే నంబర్లలో సాగవుతున్న పంటలను ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే తరచూ ఈ యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. వ్యవసాయ భూములు ఫొటో తీసే క్రమంలో అక్షాంశ, రేఖాంశాలు సరిలేవని చూపుతూ ఈ క్రాప్‌లో వివరాలు నమోదు కావడంలేదు. ఈ పరిస్థితుల్లో ఒకే వ్యవసాయ క్షేత్రానికి ఒకటికి నాలుగుసార్లు తిరగాల్సి వస్తోందని విఎఎలు వాపోతున్నారు. విఎఎలతోపాటు వ్యవసాయ భూమి హద్దులు చూపేందుకు రైతులు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఈ క్రాప్ నమోదులో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాలో 3,28,648 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల

పంటలు సాగయ్యాయి. ఆగస్టు తొమ్మిదో తేదీన ఈ క్రాప్ నమోదు ప్రారంభమైంది. ఇప్పటికి కేవలం కేవలం 36,309 ఎకరాలకు మాత్రమే ఈక్రాప్ నమోదు చేయగలిగారు.

కౌలు రైతులకు పంట రుణాలెప్పుడు ?

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో 4 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 3 లక్షల 18 వేల మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. వీరిలో అత్యధిక సంఖ్యలో రెండు లక్షల మంది కౌలు రైతులున్నారు. కానీ 52 వేల మంది కౌలు రైతులకు మాత్రమే ప్రభుత్వం పంట సాగు హక్కు ధృవీకరణ పత్రాలను (సిసిఆర్‌సి)లను మంజూరు చేసింది. ఈ క్రాప్ నమోదును ప్రామాణికంగా తీసుకునే కౌలు రైతులకు వాణిజ్య బ్యాంకులు నూతనంగా పంట రుణాలు మంజూరు చేస్తాయి. కానీ ఈ క్రాప్ జాప్యం అవ్వడంతో మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా సిసిఆర్‌సి ఉన్న కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందని పరిస్థితి నెలకొంది.

దుట్టాతో ఎంపి బాలశౌరి భేటీ

❁వైసిపి అధిష్టానం సూచనమేరకే కలయిక? ❁వంశీని, దుట్టాను కలిపే ప్రయత్నం ❁గన్నవరం రాజకీయాల్లో ఉత్కంఠ

ఎంపి బాలశౌరి, దుట్టా రామచంద్రరావు

ప్రజాశక్తి - హనుమాన్‌జంక్షన్ : గత ఎన్నికల్లో వైసిపి తరపున బరిలో నిలిచి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలైన యార్లగడ్డ వెంకట్రావు టిడిపిలో చేరిన నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గంలో పార్టీకి జరుగుతున్న నష్టాన్ని భర్తీ చేసేందుకు వైసిపి అధిష్టానం చర్యలు చేపట్టింది. దిద్దుబాటు చర్యల్లో భాగంగా వల్లభనేని వంశీతో విభేదించి గత కొంతకాలంగా పార్టీ క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్న వైసిపి సీనియర్ నేత, మాజీ ముఖ్య మంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి సన్నిహితుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావును తిరిగి క్రియాశీల రాజకీయాల్లో పాల్గొనేలా చేసేందుకు ప్రయత్నిస్తోంది. వైసిపి అభ్యర్థి యార్లగడ్డపై విజయం సాధించిన టిడిపి అభ్యర్థి వంశీ ఆ తర్వాత వైసిపి దగ్గరయ్యారు. దీంతో టిడిపికి నియోజకవర్గంలో నాయకత్వం లేకుండా పోయింది. మరోవైపు వంశీ చేరికతో నియోజవర్గంలో వైసిపి యార్లగడ్డ, దుట్టా, వంశీ గ్రూపులుగా విడిపోయింది. ఆ తర్వాత వంశీకి వ్యతిరేకంగా దుట్టా, యార్లగడ్డ గ్రూపులు ఏకమై నిజమైన వైసిపి కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. అయితే అధిష్టానం వంశీతో కలిసి పనిచేయాలని యార్లగడ్డకు, దుట్టాకు సూచించింది. కానీ రెండేళ్లపాటు మౌనంగా ఉన్న యార్లగడ్డ....ఇటీవల గన్నవరం చేరిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో (మిగతా 6లో)

పార్టీ కోసమే దుట్టా పని చేస్తారు : ఎంపి బాలశౌరి

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుల్లో డాక్టర్ దుట్టా రామచంద్రరావు ఒకరిని ఎంపి బాలశౌరి తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ గన్నవరం నియోజకవర్గంలో ఒక మంచి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. 2014 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారని, అయినా పార్టీని వీడకుండా నిరంతరం పనిచేస్తూనే ఉన్న గొప్ప నాయకుడని అన్నారు. జగన్ గెలుపు కోసం ఆయన అహర్నిశలు పని చేస్తారని చెప్పడంలో ఏ విధమైన సందేహం లేదన్నారు. గత ఎన్నికల్లో గన్నవరం నియోజకవర్గంలో తనకు పదివేల మెజార్టీ వచ్చిందని, ఆ కతజ్ఞతను తాను ఎప్పటికీ మర్చిపోనని, నియోజకవర్గ అభివద్ధికి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేస్తూనే ఉంటానని ఎంపి వివరించారు. ఇటువైపు వచ్చినప్పుడల్లా దుట్టాను కలిసి వెళుతుంటానని, ఇప్పుడూ అందుకే వచ్చానని చెప్పారు. దుట్టా రామచంద్రరావు ఎప్పుడైనా పార్టీ కోసమే పని చేస్తారని స్పష్టం చేశారు. గన్నవరం నియోజకవర్గంలో వంశీతో కలిసి పని చేయలేనని దుట్టా గతంలో చెప్పిన విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా.. ప్రారంభంలో వారి మధ్య చిన్నచిన్న అవగాహన లోపాలు వచ్చాయని, వాటిని సర్దుబాటు చేసుకుని భవిష్యత్తులో కలిసి ముందుకు పయనించడం ద్వారా పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పార్టీ కోసమే డాక్టర్ రామచంద్రరావు పనిచేస్తారని మరోసారి చెప్పారు. వైసిపి నుండి యార్లగడ్డ వెంకట్రావు టిడిపిలోకి వెళ్లిపోయారు కదా, ఆయనకు సంహితంగా ఉండే దుట్ట కూడా వెళ్లిపోతారా అని విలేకరులు ప్రశ్నించగా, అలాంటిదేమీ ఉండదన్నారు. వచ్చే ఎన్నికల్లో యార్లగడ్డ గెలుపునకు దుట్టా పని చేస్తారనే వాదన వినిస్తోందని అనగా, అది మీడియా సష్టి మాత్రమేనని ఎంపి నవ్వుతూ సమాధానమిచ్చారు. ఈసమావేశంలో వైసిపి నాయకులు నక్కా గాంధీ పాల్గొన్నారు.

విద్వేష రాజకీయాలతో లౌకిక వాదానికి ముప్పు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అవనిగడ్డ : దేశ లౌకికవాదానికి విద్వేషపూరిత రాజకీయాలు పెనుముప్పుగా తయారయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం కృష్ణాజిల్లా రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా అవనిగడ్డలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం "భారత లౌకిక రాజ్యాంగంపై మతోన్మాదుల దాడి - పర్యవసనాలు-పరిష్కారాలు"పై సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల మధ్య విద్వేషాలు, చీలికలు తెచ్చేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. విభిన్న సంస్కృతులు, భిన్న మతాలతో లౌకిక రాజ్యంగా కొనసాగుతున్న దేశాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములుకాని వారు, సంబంధం లేని వారు దేశభక్తులుగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మతోన్మాదుల దృష్టిలో గాంధీ మహాత్ముడు జాతిపిత కాదని, వీర సావార్కర్‌ను జాతిపితగా గుర్తించాలనేది వారి లక్ష్యమని అన్నారు. మతోన్మాదుల దృష్టిలో ఆంజనేయుడు బొమ్మ ఉన్న కాషాయ జెండానే జాతీయ పతాకమని, మనుధర్మాన్నే భారత రాజ్యాంగంగా తీసుకురావాలనే సంకల్పంతో పని చేస్తున్నారన్నారు. గాంధీని హత్య చేసిన గాడ్సేను దేవుడుగా పూజిస్తున్నారని చెప్పారు. కుల వ్యవస్థను పునరుద్ధరించాలని

ప్రసంగిస్తున్న వి శ్రీనివాసరావు

ప్రయత్నిస్తున్నారని అన్నారు. నూతన విద్యా విధానం ద్వారా బడుగు బలహీన వర్గాలను విద్యకు దూరం చేసే కుట్ర సాగుతోందన్నారు. విద్య కాషాయీకరణను, దేశ న్యాయ వ్యవస్థను సైతం తమ చెప్పుచేతల్లో ఉంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు ఉపక్రమించాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, నాయకులు చౌటపల్లి రవి, వై.మధు, వాకా రామచంద్రరావు, బండి ఆదిశేషు పి.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల్లో "భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం ఆర్థిక విధానాలు, సంస్కరణలు" అనే అంశాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎస్.వెంకట్రావు బోధించారు. అనంతరం వి.శ్రీనివాసరావు పార్టీ రాజకీయ విధానాలు ఎన్నికల ఎత్తుగడల గురించి వివరించారు. కోసూరి శివ నాగేంద్రం ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.

కనీస వేతనాల అమలుకు నిరసన

కంచికచర్లలో కార్మికుల ఆందోళన


పెనుగంచిప్రోలులో అధికారికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

విస్సన్నపేటలో అధికారికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - కంచికచర్ల: గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, క్లాప్ మిత్రులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కంచికచర్లలో పారిశుధ్య కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. సిఐటియు అనుబంధంగా ఉన్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య కార్మికులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నుండి జాతీయ రహదారి మీదుగా మండల పరిషత్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు బెజ్జం భూషణం మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం నెలకు 20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జీవో నెంబర్ 132 ప్రకారం కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం, గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 5వ తేదీన జీతాలు చెల్లించాలని, టెండర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 680 ప్రకారం క్లాప్ మిత్రులకు నెలకు కనీస వేతనం 10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ కె.బాల శంకర రావుకు వినతిపత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 132ను వెంటనే అమలు చేయాలని, టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్‌లతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, పెన్షన్ స్కీమ్, అలవెన్సులు కూడా ఇవ్వాలని, పంచాయతీలో డ్రైవర్స్, స్వీపర్స్‌ను వాటర్ వర్క్స్‌ను అర్హత ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నినాదాలు చేస్తూ మండల పరిషత్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శ్రీనివాసరావు, రాంబాబు, రాఘవులు, ప్రసాద్, రామచంద్రరావు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట : పంచాయతీ కార్మికుల పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని విస్సన్నపేట ఎంపిడిఒ వెంకటరమణకు మొరపెట్టుకున్న గ్రామ పంచాయతీ కార్మికులు సిఐటియు జిల్లా కమిటీ పిలుపు మేరకు జిల్లా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై విస్సన్నపేట సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో విస్సన్నపేట ఎంపిడిఒకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నాగరాజు మాట్లాడుతూ విస్సన్నపేట గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కార్మికులకు పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని టెండర్ విధానం రద్దు చేయాలని వారికి కావాల్సిన కాస్మెటిక్ మెటీరియల్ అందజేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞానరత్నం రైతు సంఘం నాయకులు పులిబల్ల ఏడుకొండలు పంచాయతీ కార్మికులు జమలయ్య సుధాకర్, మరియమ్మ, ఆదిలక్ష్మి, కొండలు తదితరులు పాల్గొన్నారు.(ప్ర.వి)

ఎన్ టి ఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు హైకోర్టు తీర్పుని అమలు చేయాలని ఈఎస్ఐ పిఎఫ్ ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో నున్న గ్రామపంచాయతీ కార్మికులు మరియు ఎన్టీఆర్ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుబ్బారావు ఆంజనేయులు పి వెంకటేశ్వరరావు, సిపిఎం సభ్యులు ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు

9న లోక్‌అదాలత్

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు కోర్టు ఆవరణలో సెప్టెంబరు 9న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ తెలిపారు. శనివారం కోర్టు హాల్లో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదుల, నాలుగు మండలాల ఎస్ఐలతో ఆయన సమావేశం నిర్వహించారు. కక్షిదారులకు రాజీ చేసుకోదగిన కేసులపై అవగాహన కల్పించి అదాలత్ విజయవంతం చేయాలని న్యాయవాదులను, పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ చైర్మన్ సంకురాత్రి జనార్దనరావు, కార్యదర్శి అంకిరెడ్డి అంజన్ రెడ్డి, ఏపిపి రమేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

టిటిడిలో టివిఎస్ మోటార్ కంపెనీ ఎమ్‌డికి స్థానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన 24 మంది పాలకవర్గ సభ్యుల్లో టివిఎస్ మోటర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ వేణుకు కూడా చోటు దక్కిందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ పదవిలో వేణు రెండేళ్లపాటు కొనసాగుతారని తెలిపారు. ఆలయ కార్యకలాపాలను పర్యవేక్షించే అంతిమ అధికారం ఈ పాలకవర్గానికి ఉంటుందని చెప్పారు. వైవిధ్యభరితమైన అవగాహనతో ఆలయ పనితీరుకు సుదర్శన్ ఉన్నతంగా తోడ్పడగలరని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెం గ్రామం దళితవాడకు చెందిన టిడిపి నాయకులు చాట్ల అచ్చియ్య కుమారుడు చాట్ల మనోహర్ బాబు (22)ఇటీవల కాలంలో మతి చెందారు. కాగా శనివారం నాడు టిడిపి నాయకులు ఉయ్యూరు బొర్రా రెడ్డి, బాలకష్టారెడ్డి, ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి(పెద్దోడు) కలిసి అచ్చియ్య కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు మాతంగి రామారావు, అయ్యంగి కోటయ్య పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మండలంలో సత్యనారాయణపురం అమ్మ నాన్న వద్దాశ్రమంలో శనివారం అన్నదానం నిర్వహించారు. లయన్ జోన్ చైర్మన్ బయన జగదీష్, ప్రియాంకల కుమార్తె చిరంజీవి అర్పిత పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు మైలవరం లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. అనంతరం వద్దుల సమక్షంలో తమ కుమార్తె పుట్టిన రోజు జరుపుకున్న లయన్ దంపతులను అభినందించారు. మైలవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు జస్తి వెంకటేశ్వరావు, కార్యదర్శి చలవది హరీష్ గుప్తా, కొశాధికారి తిమ్మన దినేష్ లయన్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లేళ్ల ఏడుకొండలు, సిహెచ్.వెంకటేష్, సి హెచ్ రంగారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పేదల సొంతింటి కల సాకారమవుతోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తున్నారని యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని బలుసుపాడు రోడ్డు జగనన్న కాలనీలో మిట్టగూడెం బజారుకు చెందిన మళ్ళ శ్రీనివాస్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గూడు లేని లక్షల మంది పేదలు సొంతింటి యజమానులు అవుతున్నారని అన్నారు.

ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను వినియోగించుకొని స్వయం ఉపాధి పొంది మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సర్కిల్-2 పరిధిలోని 58వ డివిజన్ కమ్యూనిటీ హాలులో యుసిడి విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి మహిళా ఆర్థికంగా పురోగతి సాధించడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. దానిలో భాగంగానే ప్రతి సర్కిల్ పరిధిలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆరు మాసాలు శిక్షణ ఇచ్చి, రకరకాల డిజైన్లు కుట్టే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రతి మహిళా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి అయిన తరువాత సర్టిఫికెట్స్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి

సమావేశంలో ఎస్ ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఎస్ఎఫ్ఐ జగ్గయ్యపేట మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలంలో జూనియర్ కళాశాల మరియు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన విడుదల చేయాలని, అమ్మ ఒడి బటన్ నొక్కి దాదాపు నెలరోజులు పైన అవుతుంది ఇప్పటివరకు విద్యార్థి తల్లి అకౌంట్లో అమ్మ ఒడి డబ్బులు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జీవో నెంబర్ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న నాడు నేడు పనులు పూర్తి చేయాలని, 3, 4, 5తరగతుల విలీనం ఆపాలని, మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం సరఫరా చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న సంక్షేమ హాస్టల్లో మెస్ చార్జీలు కాస్మెటిక్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జగ్గయ్యపేట మండల కార్యదర్శి భరత్, అధ్యక్షుడు అజయ్, మండల కమిటీ సభ్యులు కమల్, శివ, తరుణ్ పాల్గొన్నారు.

ఎంఎల్‌సికి వినతి

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరు మండల కేంద్రం కార్యాలయం ప్రారంభించడానికి విచ్చేసిన డాక్టర్ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్‌కు సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సిపిఎం గ్రామ కార్యదర్శి లాలాహమ్మద్ గౌస్ అందజేశారు. సిపిఎం శాఖ అందించిన వినతిపత్రంలో ప్రతి విషయాన్ని పరిశీలించి గ్రామ సమస్యలు పరిష్కరిస్తామని మాట్లాడుతూ చెప్పారు. జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల కావాలని సిపిఎం తెలియజేయగా అరుణ్‌కుమార్ త్వరలో పాలిటెక్నిక్ కళాశాల జూనియర్ కళాశాల మంజూరు చేపిస్తామని హామీ ఇచ్చారు.

ఎంఎల్‌సి వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి - వీరులపాడు : జుజ్జూరులో మండల కార్యాలయాల ఏర్పాటు సందర్భంగా ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ టిడిపిపై చేసిన విమర్శలను టిడిపి నాయకులు ఖండించారు. ఈ మేరకు టిడిపి మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో జుజ్జూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రం మార్పు విషయంలో ఏ రోజైన ప్రతిపక్ష పార్టీల అభిప్రా యాలను తీసుకున్నారా అని ప్రశ్నిం చారు. ఈ సమావేశంలో నాయకులు చీదిరాల భారత్ రెడ్డి, కాపా రాంబాబు, తమ్మిశెట్టి వీరబాబు, నిమ్మల రాజేంద్ర, మాదల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

వివరాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మెయిన్ రోడ్డులోని కుసుమ హరనాథ్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో ఈ నెల 31న ప్రారంభం కానున్న గోదావరి - కష్టా కో - ఆపరేటివ్ సొసైటీ బ్రాంచిలో శనివారం పరిచయ వేదిక సమావేశం నిర్వహించారు. ఖాతాదారుల సర్వతోముఖాభివద్దే ధ్యేయంగా కష్టా కో - ఆపరేటివ్ సొసైటీ పనిచేస్తుందని గోదావరి - కష్టా కో - ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మేడూరి జీవన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపాజిటర్లకు అత్యధిక వడ్డీతో పాటు చిన్న, మధ్య తరహా వ్యాపారులకు తక్కువ వడ్డీతో కూడిన రుణాలు అందించాలనే ఉద్దేశ్యంతో సంస్థను స్థాపించినట్లు తెలిపారు. 2019లో రిజిస్టర్ అయిన ఈ సంస్థ సభ్యుల మన్ననలు పొంది అనతికాలంలోనే ఇబ్రహీంపట్నంలో 11వ బ్రాంచిని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సంస్థలో బంగారంపై రుణాలు,తనఖా రుణాలతో పాటు లాకర్లసదుపాయం అందిస్తామని తెలిపారు. త్వరలో ప్రతి మండలంలో తమ సొసైటీ బ్రాంచి ఏర్పాటు చేసి వెయ్యి మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరి - కష్టా కో - ఆపరేటివ్ సొసైటీ సిబ్బంది శివరామకష్ణ, వెంకటేష్, హరేంద్ర, పవన్, సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం నూతన ఇఒగా బాధ్యతలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమ లగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం నూతన కార్య నిర్వ హణా ధికారిగా సి.జయ ప్రకాశ్ బాబు శని వారం బాధ్యతలు చేప ట్టారు. దేవదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్య నారాయణ స్వామి వారి దర్శనానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు మరియు తిరునగరి రామకష్ణమా చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సత్యనారాయణ ను సత్కరిస్తున్న దేవస్థానం సిబ్బంది

ఆరోపణలు నిరూపించాలి

ప్రజాశక్తి - భవానీపురం : తనపై జనసేన నాయకుడు పోతిన మహేష్ అసత్య ఆరోపణలు చేయటం కాదని, వాటిని నిరూపించాలని 40వ డివిజన్ వైఎస్ఆర్‌సిపి కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి సవాల్ చేశారు.. శనివారం భవానీపురంలోని ఎన్‌టిఆర్ జిల్లా వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ తాను 25 ఏళ్లుగా స్కూల్ నడుపుతున్నానని, ఇప్పటికే 10 వేల మంది బాలబాలికలకు చదువు చెప్పానని, తనపై ఎటువంటి ఆరోపణలూ లేవన్నారు.

నేడు విమానాశ్రయానికి అమిత్ షా రాక

• ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-గన్నవరం : కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఈనెల 27న తెలంగాణ పర్యటన నేపథ్యంలో ఆదివారం గన్నవరం ఎయిర్‌పోర్టుకు రానున్నారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు అధికారులు గన్నవరం ఎయిర్‌పోర్టు వద్ద ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా బందోస్తుకు సంబంధించి కలెక్టర్ పి.రాజాబాబు, ఇతర ఉన్నతాధికారులకు పలు సూచనలు జారీ చేశారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్గమనం వద్ద శనివారం సాయంత్రం భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన పనుల ఏర్పాట్లపై సమీక్షించారు. ఎయిర్‌పోర్ట్ నుంచి గన్నవరం సమీప రహదారి పరిస్థితులను పోలీసు అధికారులు పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్‌లో బిఎస్ఎఫ్ హెలికాప్టర్ ఎక్కడెక్కడ దిగాలో ఆయా స్థలాలను పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం వరకు ఉన్న దూరం ఎంత ఉంటుందనే విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ.. కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు గన్నవరం ఎయిర్పోర్ట్ లో కొద్ది సమయం గడపనున్న నేపథ్యంలో బందోబస్తు పటిష్ఠంగా ఉండాలన్నారు. అలాగే భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కాన్వాయ్ రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కోరారు. పోలీసు శాఖ బ్లూబుక్ ప్రకారం తగిన భద్రత, శాంతి భద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది, అంబులెన్స్, ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు వైద్య సహాయం నిమిత్తం గన్నవరంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించారు. అలాగే రెస్ట్ హౌస్ గా గన్నవరం పోలీస్ స్టేషన్ ను కలెక్టర్ పి రాజాబాబు పరిశీలించారు. గన్నవరం ఎయిర్పోర్ట్ వద్ద అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని గుణదల డిఈని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలం సీజన్ అయినందువల్ల ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి (ఏ.ఆర్) ఎస్ వి డి ప్రసాద్, సి ఆర్ పి ఎఫ్ డిసి ధనుంజయ్ యాదవ్, గన్నవరం డిఎస్పి జయసూర్య, ఎయిర్పోర్ట్ డిఎస్పి వెంకటరత్నం, గన్నవరం ఎయిర్పోర్ట్ ఇన్చార్జి డైరెక్టర్ పివి రామారావు, గన్నవరం తహసీల్దార్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మంత్రి తమ్ముడినని డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్(గన్నవరం) : మంత్రి తమ్ముడు అని చెప్పి డబ్బులు వసూలు చేయడమే కాకుండా తిరిగి డబ్బులు అడిగినందుకు దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు హనుమాన్ జంక్షన్ సిఐ నరసింహమూర్తి శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం...కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన తొందూరు శామ్యూల్ హనుమాన్ జంక్షన్ కాకాని బాబు పశువుల సంతలో పశువుల వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలం క్రితం సంతలో దొంగల శ్రీధర్ అను అతను కోనసీమ జిల్లా రామచంద్రాపురం నియోజకవర్గ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మినిస్టర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు తమ్ముడు అవుతాను అని శామ్యూల్ కి పరిచయమయ్యాడు. తన కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకుని తిరిగేవాడు. రామచంద్రాపురంలో కూడా పశువుల వ్యాపారం చేద్దామని అక్కడ నాకు పరిచయాలు ఎక్కువ అని శామ్యూల్‌ను నమ్మించి మోసపూరితంగా అతని వద్దనుండి రూ. 10,000 తీసుకున్నాడు. ఆ తర్వాత కూడా శామ్యూల్ వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వమని అడుగగా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో నూజివీడు వెళుతున్న శామ్యూల్ ను వేలేరు గ్రామం వద్ద దొంగల శ్రీధర్ అడ్డగించాడు. నేను మినిస్టర్ తమ్ముడిని చెప్పినా గానీ నువ్వు నాకు డబ్బు ఇవ్వడం లేదు నీ అంతు చూస్తానని బెదిరించాడు. దీంతో శామ్యూల్ హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఎ.డి.యల్ జనార్ధన్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు లో భాగంగా ముద్దాయి అయిన దొంగల శ్రీధర్ ను అరెస్ట్ చేసారు. ఇతని పై ప్రత్తిపాడు, ద్రాక్షారామ, గొల్లపాలెం, రాజానగరం, అన్నవరం మరియు ఆలమూరు పోలీస్ స్టేషన్ లలో కేసులు ఉన్నాయి. ఇతని పై కిర్లంపూడి పోలీస్ స్టేషన్ లో రౌడీ షీట్ ఉంది. అరెస్ట్ చేసిన ముద్దాయి దొంగల శ్రీధర్ ను రిమాండ్ నిమ్మిత్తం నూజివీడు కోర్ట్ కి తరలించామని సిఐ వివరించారు.



హజ్సన్ కు ఉత్తర్వులు అందజేస్తున్న నాయకులు

నూర్‌బాషాల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-గన్నవరం : నూర్ భాషా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమద్ది చిన్న మస్తాన్ ఆధ్వర్యంలో గన్నవరం మండలం దాబాజీగూడెం గ్రామంలో శనివారం జిల్లా స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు ఓటూరి రసూల్ సాహెబ్ ఆదేశాలు మేరకు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏలూరు గాజుల బాజీ, జిల్లా అధ్యక్షులు షేక్ బాజీ ముఖ్య అతిథిలుగా విచ్చేసి కృష్ణ జిల్లాలో పలువురికి సంఘ పదవులు ప్రకటించారు. కృష్ణ జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా పెనమలూరు కు చెందిన కారుమంచి హుస్సేన్ ను నియమించారు. గన్నవరం నియోజకవర్గం అధ్యక్షులుగా గన్నవరానికి చెందిన డి. రాజా రసూల్ ని, గన్నవరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలుగా షేక్ ఖాదర్ బీ ని, పెనమలూరు నియోజకవర్గం ఉపాధ్యక్షులుగా పెనమలూరు కు చెందిన షేక్ సలీమ్ బాషాకు నియామక పత్రాలు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూరుభాషా కార్పొరేషన్ మరియు నూరు భాషా షాదీ తోఫా యాభై వేలు నుండి లక్ష రూపాయలు వచ్చే విధంగా, ఇంకా మన నూరు భాషియుల సమస్యలు పరిష్కారం కొరకు నిరంతరంకృషి చేస్తామని చెప్పారు.

1న 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రజాసేవ చేసే ఉద్యోగికి పెన్షన్ అనేది హక్కు అది ఎవరి బిక్ష కాదని ఆంధ్రప్రదేశ్ కం ట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అసోసి యేట్ ప్రెసిడెంట్ సీఎం దాస్ అన్నారు. ఉయ్యూరులో నాగళ్ల రాజేశ్వరమ్మ జాన కిరామయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏపీసీపీఎస్ఈఏ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వై నాట్ ఓపీఎస్ ఇన్ ఏపీ, సెప్టెంబర్ 1న చలో విజయవాడ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో దాస్ పాల్గొని మాట్లాడు తూ 30 సంవత్సరాలకు పైగా ప్రజాసేవ చేసే ఉద్యోగికి పెన్షన్ అనేది హక్కుఅది ఎవరి బిక్ష కాదన్నారు. పక్కరాష్ట్రాలు సీపీఎస్ విధానం రద్దుచేసి పాతపెన్షన్ విధానం అమలు చేస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం జీపీఎస్(గ్యారెంటీ పెన్షన్ స్కీమ్) అని నిరంకుశత్వంగా సీపీఎస్ ఉద్యోగు లపై బలవంతంగా రుద్దడం ఏమిటని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుడు పేపేటి సత్యనారాయణ మాట్లాడుతూ రాజస్థాన్, ఛత్తీస్గడ్, ఝార్ఖం డ్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, పంజాబ్లో సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలుచేస్తున్నారని, మహారాష్ట్రలో కూడా తక్షణమే పాత పెన్షన్ విధానం అమలుకు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా ఎఫ్ఎ పీటీవో అధ్యక్షుడు బడుగు లంకేశ్ మాట్లాడుతూ ఆర్టికల్ 309 ప్రకారం పక్కరాష్ట్రాలు అమలుచేసిన విధంగానే మన రాష్ట్రంలో కూడా అమలుచేయాలని కోరారు. సెప్టెంబర్ 1న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వీవీ రమణ పి లుపునిచ్చారు అబ్దుల్, రాజేశ్, నాంచారయ్య, వీరయ్య, ఫ్యాప్టో నాయకుడు లంకేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నాయీ బ్రాహ్మణులకు న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 50 వల్ల నాయీ బ్రాహ్మణులకు ఎలాంటి ఉపయోగపడడం లేదని నాయీ బ్రాహ్మణ సవిత సమాజం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి కోటి పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం నూజివీడులో నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రలో నాయీ బ్రాహ్మణ సవిత సమాజం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి కోటి పాల్గొని అనతరం అయనకు విన్నతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ వాయిద్య కళాకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, జీవ్ నెంబర్ 44 ప్రకారం 7 సంగీత పాఠశాలు మూసివేశారన్నారు. వాటిని వెంటనే కొనసాగించాలని లోకేష్‌కు విన్నవించారు. శ్రీసాయి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షులు విక్కుర్తి పోతురాజు, వాయిద్య కళాకారులు, పాల్గొన్నారు.

శ్రీనివాసరావు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో విలేకరి మృతి

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం నియోజకవర్గ 99 టివి రిపోర్టర్ శ్రీనివాసరావు(50) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. గుడ్లవల్లేరు మండలం దోకిపర్రు గ్రామానికి చెందిన శ్రీనివా సరావు శుక్రవారం మచిలీపట్నంలో విధులు ముగించు కుని స్వస్థలం దోకిపర్రు వెళుతుండగా మచిలీపట్నం విజయవాడ జాతీయ రహదారిలో సుమ కన్వెన్షన్ సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. రక్తపు మడుగులో పడి ఉన్న శ్రీనివాసరావును హుటాహుటిన మచిలీపట్నంలోని సర్వజన ప్రభుత్వాసృత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. విజయవాడ హెల్ప్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు మృతి చెందాడు. అయితే శ్రీనివాసరావుకు జరిగిన ప్రమాదంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీనివాసరావు రక్తపు మడుగుల్లో పడి ఉన్న కొద్ది దూరంలోనే ఓ లారీ రాంగ్ రూట్ లో వచ్చి డివైడర్ ని ఢీకొన్నట్టు ఉంది.అలాగే ఘటనాస్థలిలో ఓ మహిళకు చెందిన చెప్పులు, ఓ పురుషుడి చెప్పులతో పాటు గాజుల ముక్కలు పడి ఉన్నాయి. ఘటనాస్థలిలో ఉన్న పరిస్థితులు చూస్తుంటే శ్రీనివాసరావుపై ఎవరైనా హత్యా ప్రయత్నం చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బందరు తాలూకా ఎస్ ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరావు కు భార్య ఇద్దరు కుమారులు వున్నారు పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

• కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో నూటికి నూరు శాతం బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ ఓ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి విద్య, వైద్యం, వైయస్సార్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డులు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పరిధిలో విద్యావ్యవస్థను పటిష్ఠపరుచుటలో భాగంగా బడి, కళాశాల ఈడు పిల్లలందరూ నూటికి నూరు శాతం విద్యాసంస్థల్లో చేర్పించాలని, ఏ ఒక్కరు కూడా చదువుకోకుండా విద్యాసంస్థల బయట ఉండరాదన్నారు. మండలాల వారీగా ఏ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో ఎంతమంది చేరాల్సి ఉంది, ఎంతమంది చేరారు, ఇంకా ఎంతమందిని చేర్పాలి అనే అంశాల పైన లోతుగా విశ్లేషించి తప్పనిసరిగా అందరిని విద్యాసంస్థల్లో చేర్పించాలన్నారు. ఇందుకోసం మండల విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని నూటికి నూరు శాతం లక్ష్యాలను సాధించాలన్నారు.జిల్లాలో బాగా బోధన చేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లను గుర్తించి వారి ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ అంశంపై సోమవారం విద్యాశాఖ ఎంఈఓ లతో సమావేశం నిర్వహించి సమగ్ర ప్రణాళికను రూపొందించాల్సి ఉంటుందన్నారు.జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ వైద్యశాలలు, సర్వజన ఆసుపత్రులు అన్నింటిలోనూ ఆరోగ్యశ్రీ సేవలు మరింత మెరుగుపడాలన్నారు. ముఖ్యంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు తప్పనిసరిగా చేయాలన్నారు. తద్వారా ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నారో, ఏ తేదీన ప్రసవం జరిగే అవకాశం ఉందనే సమాచారం అందుబాటులో ఉండాలని, వారికి క్రమం తప్పకుండా అవసరమైన వైద్య సేవలు అన్ని సక్రమంగా అందించాలన్నారు. ప్రసవాలలో సాధారణమైనవి, హై రిస్క్ లో ఉన్నవి గుర్తించి వాటి వివరాలను పై స్థాయిలో ఉన్న వైద్యశాలలకు పంపించాలన్నారు. ఏ ప్రభుత్వ వైద్యశాలలో ఎన్ని ప్రసవాలు జరగాలి, ఎన్ని జరుగుతున్నాయి, ఎలా జరుగుతున్నాయి అనే విషయాల పైన సంపూర్ణ పర్యవేక్షణ ఉండాలన్నారు. వైయస్సార్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డులు పొందుట కోసం సమాజ సేవా కార్యక్రమాల్లో విశేషంగా కృషిచేసిన వ్యక్తుల గుర్తించి ప్రతిపాదనలు రెండు రోజుల్లో పంపాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విరాళం

చర్చికి విరాళం ఇస్తున్న సురేష్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గల సిఎస్ఐ చర్చిలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిఎన్‌టియుసి కార్యదర్శి మాడుగుల సురేష్ పాల్గొని చర్చి పనులను పరిశీలించి పెండింగ్ పనులు కొరకు 30 వేల రూపాయల నగదును చర్చి సంఘ పెద్దలకు అందజేశారు. ఇదే మందిరమునకు గతంలో 100 సిమెంట్ కట్టలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ గంధం రవి కుమార్, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఆరోపణలపై ఆంజనేయరెడ్డి వివరణ ఇవ్వాలి

మాట్లాడుతున్న జనసేన నగర అధికార ప్రతినిధి గయాజుద్దీన్

ప్రజాశక్తి - భవానీపురం : తనపై వచ్చిన ఆరోపణ అవాస్తమని కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి నిరూపించుకోవాలని, లేదంటే తన పదవికి రాజీనామా చేయాలని జనసేన నగర అధికార ప్రతినిధి, 40వ డివిజన్ జనసేన అధ్యక్షులు షేక్ గయాజుద్దీన్ (ఐజా) డిమాండ్ చేశారు. శనివారం భవానీ పురంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్ ఆంజనేయ రెడ్డి వద్దకు రెడ్డి సమాజానికి చెందిన ఓ మహిళ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇప్పించాలని వెళ్తే ఆమె పట్ల ఆయన ప్రవర్తించిన తీరుపై రెండు రోజులుగా వివిధ ప్రసార మాధ్యమాల్లో, వార్తా ప్రతికల్లో వచ్చిన వార్తలపై నిజం నిరూపించుకోవాలన్నారు.

మాతృభాషతోనే మనో వికాసం

-కేంద్ర సాహిత్య అకాడమీ డెప్యూటీ సెక్రటరీ సురేష్‌బాబు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విద్యార్థులు మాతృభాషతోనే మనో వికాసాన్ని సాధించగలరని కేంద్ర సాహిత్య అకాడమీ డెప్యూటీ సెక్రటరీ డాక్టర్ నారాయణం సురేష్‌బాబు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం వారోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నారాయణం సురేష్‌బాబు మాట్లాడుతూ తెలుగు భాషా మాధుర్యం అపూర్వమైనదన్నారు. దేశంలోని ఇతర భాషలకు లేని ఎన్నో ప్రత్యేకతలు తెలుగు భాషకు ఉన్నాయన్నారు. మాతృభాషలో విద్యాబోధనపై కేంద్ర మానవ వనరుల శాఖ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. సిబిఎస్ఇ ఇప్పటి వరకు ఇంగ్లీష్‌లో మాత్రమే బోధన ఉండేదన్నారు. కానీ రానున్న రోజుల్లో మాతృభాషలోనే సిబిఎస్ఇ సిలబస్‌ను మార్పు చేయటానికి కసరత్తు జరుగుతుందన్నారు. మాతృభాషా వికాసానికి గిడుగు రామ్మూర్తి అందించిన చేయూతను సభకు వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పివిఎల్ రమేష్ మాట్లాడుతూ మానవ వికాసానికి ఆయా మాతృభాషలే సాధనాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు భాష అద్భుతమైనదన్నారు. తెలుగు భాషా వికాసానికి అనేక మంది ప్రముఖులు అపూర్వమైన సేవలందించారని వివరించారు. మాతృభాషా వికాసానికి అందరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ జేవీ చలపతిరావు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి-విజయవాడ : ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ జిల్లాలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు యథావిధిగా పని చేస్తాయని, ఈ సదవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని ఎపిసిపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్ విజయవాడ ఎస్ఇ ఎ మురళిమోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... సెలవు రోజు అయినప్పటికీ ఆదివారం నాడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని అన్నారు. వివిధ మార్గాల ద్వారా బిల్లులు చెల్లించి, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

45వ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి

రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న వెలంపల్లి

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 45వ డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషిచేస్తానని పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. శనివారం 45వ డివిజన్‌లో వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, అధికారులు నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. అనంతరం రూ. 33.69 లక్షల నిధులతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్‌కి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ గతంలో డివిజన్ అస్తవ్యస్తంగా ఉండేదన్నారు. నేడు వైకాపా వచ్చాకా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. డివిజన్‌లోని కొండప్రాంతాల్లో ర్యాంపులు, మెట్లు అభివృద్ధి చేశాం అన్నారు. రోటరీనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని, త్వరలో వాడుకలోకి వస్తుందన్నారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మంచినీటి సరఫరా మంచిగా జరుగుతుందని, నియోజకవర్గ అభివద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ వైసీపీ నాయకులు మైలవరపు కష్ణ, మైలవరపు దుర్గారావు, కోటేశ్వరరావు, బుజ్జి, లక్ష్మణ్, దుర్గేసుల హుస్సేన్, నల్లం వాసు, కట్టా సత్తయ్య, ముత్తా వాసు, డి.రాము, డాక్టర్ రత్నమాచారి,ఉండబత్తుల దుర్గారావు, డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

చెక్కు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి- నందిగామ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. నందిగామలో కేంద్ర న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మచిలీపట్నం , సంయుక్త కృష్ణా జిల్లా ఎన్టీఆర్ జిల్లా పరిపాలన యంత్రాంగం పోలీసు యంత్రాంగం సంయుక్తంగా శనివారం నూతన తరహా న్యాయ శిబిరం నిర్వహించారు. నందిగామ నెహ్రు నగర్ కమ్మ కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమం కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, నందిగామ 16వ అదనపు జిల్లా జడ్జి అడిషనల్ జడ్జి వి. శ్రీనివాసరావులు మాట్లాడుతూ కక్షిదారులు ఎటువంటి సమస్యలు ఉన్న లోక్ అదాలత్ ద్వారా ఇరు పార్టీల వారు రాజీ చేసుకుని పరిష్కారం చేసుకోవాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను వేదికపై ప్రదర్శించారు. ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలి అని అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో నందిగామ సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ రాజ్యం,జూనియర్ జడ్జి తిరుమల రావు, అదనపు సివిల్ జడ్జి రియాజ్,నందిగామ ఏసిపి.జనార్దన్ నాయుడు, నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బండి మల్లికార్జునరావు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అజాద్, న్యాయవాదులు, పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి

ప్రజాశక్తి - గంపలగూడెం : గంపలగూడెంలో మదర్ తెరిసా 113 వ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు గద్దల ఆదాం పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు థెరిసా చేసిన త్యాగాలను వివరించారు. కార్యక్రమంలో మేరుగు రంజిత్ కుమార్, మాగంటి వెంకటకృష్ణ తదితరులు చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గంపలగూడెంలో ...

జగ్గయ్యపేట : పట్టణంలో మదర్ థెరిసా జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర, వైసిపి పట్టణ అధ్యక్షుడు ఆకుల బాజీ పాల్గొన్నారు. శనివారం మదర్ థెరిసా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్, పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో

మైలవరం : మదర్ థెరిసా జన్మ జయంతిని శనివారం మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక తిరువూరు రోడ్‌లోని మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మదర్ థెరిసా మానవాళికి చేసిన సేవలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వంగూరి రమేష్ బాబు, లక్కిరెడ్డి రవీందర్ రెడ్డి, గంటా రాము తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై గ్రామస్తుల ఆగ్రహం

ట్రాక్టర్లను అడ్డుకున్న స్థానికులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని మల్కాపురం గ్రామంలో గ్రామ సమీపంలోని మున్నేరు క్వారీ నుండి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారంటూ గ్రామస్తులు శనివారం ఇసుక క్వారీకి వెళ్లే ట్రాక్టర్లను ఆపేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధిక లోడుతో ట్రాక్టర్లు తమ గ్రామంలోని సిసి రోడ్లపై వెళ్లడంతో సి సి రోడ్లు, డొంక రోడ్లు, పంట పొలాలకు వెళ్లే రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, అదేమని అడిగితే తమకు సమాధానం చెప్పడం లేదని, మీకు చేతనైంది చేసుకోమని లెక్క లేకుండా సమాధానం చెబుతున్నారని, పంట పొలాలకు వెళ్లే డొంక రోడ్డు నుండి ఇసుక క్వారీకి ట్రాక్టర్లు వెళ్లటం వలన డొంక రోడ్డు ధ్వంసమై కనీసం ద్విచక్ర వాహనాలు, రైతులు నడిచి పంట పొలాలకు వెళ్లలన్న వెళ్లలేని పరిస్థితి ఉందని, ఇసుక లోడుతో వెళ్లే ట్రాక్టర్లు బిల్లు మల్కాపురం పేరుతో కాకుండా అనిగండ్లపాడు పేరుతో వే బిల్లులు ఇస్తూ తెలంగాణకు రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు వెళుతున్నాయని దీనితో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో క్వారీకి వెళ్లే ట్రాక్టర్లను వెళ్లకుండా ఆపివేయటంతో విషయం తెలుసుకున్న చిల్లకల్లు పోలీసులు సంఘటన స్థలం వద్దకు వచ్చి గ్రామస్తులతో చర్చించారు. దీంతో గ్రామ పెద్దలతో మాట్లాడిన చిల్లకల్లు ఎస్సై కృష్ణ బాబు ఇసుకను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ మైనింగ్ అధికారులు తక్షణమే స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలు అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి సురేష్ రెడ్డి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. సురేష్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం వీరు అమ్మవారి పంచ హారతుల సేవలో పాల్గొన్నారు. వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

నెమలిలో పవిత్రోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - గంపలగూడెం: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెమలి శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం నాడు ఘనంగా ప్రారంభమైనట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ తెలిపారు. తొలి రోజు ప్రత్యేక పూజలతో ప్రారంభించినట్లు, అనంతరం తీర్థప్రసాద వినియోగాలు జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కావూరి శశిరేఖ, ఆలయ పురోహిత బందం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉదయభానును సన్మానిస్తున్న రాజేశ్వర్ రెడ్డి

సామినేనికి సన్మానం

జగ్గయ్యపేట : తెలంగాణ రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమితులైన సందర్భంగా శనివారం ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుని కలిసి శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మారుతి బేకరీ హౌస్ ప్రారంభించిన ఎంఎల్‌ఎ

మారుతి బేకరీ హౌస్ ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన మారుతి బేకరీ హౌస్ ను నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు శనివారం ప్రారంభించారు. బేకరి యజమానుని పవన్ కు నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్ దొంగ దీక్షలు ప్రజలు నమ్మరు : ఎంఎల్ఎ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్ బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ : పులిగడ్డ ఆక్విడెక్ట్ పరిరక్షణ పేరుతో బుద్ధ ప్రసాద్ నిర్వహిస్తున్న దొంగ దీక్షలను ప్రజలు నమ్మరని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. శుక్రవారం పులిగడ్డ ఆక్విడెక్టు వద్ద మాజీ సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ రైతు సామూహిక సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. దీనిపై ఎమ్మెల్యే రమేష్ బాబు స్పందిస్తూ శనివారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏదైనా మంచి కార్యక్రమం తలపెట్టినప్పుడల్లా పొలం బాట దీక్షలు చేయడం బుద్ధ ప్రసాద్ కి అలవాటే అన్నారు. వాళ్ల బంధించిన 22 ఏ భూములకు మోక్షం కల్పించామని, కరోనా సమయంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు మనోధైర్యం చెప్పామని ఆ సమయంలో బుద్ధ ప్రసాద్ ఎక్కడున్నా రో చెప్పాలన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రజల మధ్య ఉంటున్నట్లు భ్రమలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. ప్రజల దష్టిని మలచేందుకు చీఫ్ ట్రిక్కులు చేయడం బుద్ధ ప్రసాద్కు అలవాటే అన్నారు. త్వరలోనే మరో రెండు దొంగ దీక్షలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎదురు మొండి బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని, అదే విధంగా అవనిగడ్డ కోడూరు రహదారి నిర్మాణానికి కూడా త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఇందుకు దీక్షలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సమస్యలుంటే సత్యాగ్రహ దీక్షకు రైతులెందుకు కరువయ్యారో చెప్పాలన్నారు. 20 ఏళ్ల పాలనలో బుద్ధ ప్రసాద్ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని వాళ్ళ అనుచరులు మాత్రం మా నాయకుడు చేసిన పనులు చెప్పాలంటే పేజీలు సరిపోవు అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపిలో జిల్లా నాయకుడిగా ఎదిగిన అంబటి బ్రాహ్మణయ్య పేరుని ఉల్లిపాలెం వారధికి పెట్టకుండా అడ్డుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న కష్ణా గుంటూరు ఎన్టీఆర్ జిల్లాల రైతు విభాగం జోనల్ ఇంచార్జ్ కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ పులిచింతల ప్రాజెక్టుకు అవనిగడ్డలో అంకురార్పణ జరిగిందని బుద్ధ ప్రసాద్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగ్గయ్యపేట కు చెందిన వాసిరెడ్డి వంశీయులు ముత్యాలరాజు బ్రిటిష్ వారి కాలం నుంచి పోరాడితే ఏర్పడిన ప్రాజెక్టు పులిచింతల అన్నార. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గో రుముచ్చు ఉమా, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు గుర్రం బసవయ్య, లంకమ్మ, అమ్మవారి టెంపుల్ చైర్మన్ అన్నపురెడ్డి రామదాసు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ గాజుల జయ గోపాల్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పధ్వి రాజు తదితరులు పాల్గొన్నారు

28న వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-గన్నవరం : వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఈ సంవత్సరం నుండి స్కూల్ కాంప్లెక్స్ ఈ నెల 28వ తేదీ గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు శనివారం పత్రికలకు తెలిపారు. ఈ సమావేశం లో వ్యాయమ విద్య ఉపాధ్యాయుల విధి విధానాలు, ఈ విద్యా సంవత్సరం లో నిర్వహించ వలసిన క్రీడా పోటీలు ప్రణాళికలు గురించి చర్చించడం జరుగుతుందని నాగరాజు తెలిపారు. గన్నవరం నియోజకవర్గం లోని అన్ని పాఠశాలల వ్యాయమ విద్య ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఈ కాంప్లెక్స్ కు హాజరు కావాలని ఆయన తెలిపారు. ఉదయం 9 గంటలకు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-గన్నవరం : విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో.. 33/11కేవీ వీరప్పనేనిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో న్యూ లైన్ ఎర్రెక్షన్ వర్క్ నిమిత్తం .. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసిపిడిసిఎల్ గుణదల కార్య నిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు తెలిపారు. వీరప నేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి. కంట్రిక, కొత్తగూడెం, చిక్కవరం, చింతగుంట, బిబి గూడెం, గొల్లనపల్లి, ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వంట గ్యాస్ సరఫరా చేయాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటకు గ్యాస్ బండలు సరఫరా చేయాలని కోరుతూ శనివారం గన్నవరం ఎంఈఓ కు ఆంధ్రప్రదేశ్ మధ్యాన్న భోజన పథకం కార్మిక సంఘం గన్నవరం మండల కమిటి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకురాలు సమ్మక్క మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాలల కు మెనూ బిల్లులు రెండు నెలలకోసారి ఇవ్వడం వల్ల వంట చేయడం సమస్య అవుతుందని, దీనికి తోడు గ్యాస్ బండల మీద మాత్రమే వంట చేయాలని నిబంధన పెట్టడం వల్ల తమ ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అందువల్ల ప్రభుత్వం వంటకు అవసరమైన గ్యాస్ను సరఫరా చేయలన్నారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం అమలు నాటి నుండి కార్మికులుగా ఎందరో మహిళలు పని చేస్తున్నట్లు తెలిపారు. తమకు సరి అయిన వేతనం లేదని, బిల్లులు సకాలంలో రావటం లేదనీ అయినా అనేక ఇబ్బందులు ఎదుర్కొని పథకాన్ని అమలు జరుపుతున్నామని చెప్పారు. అందువల్ల ప్రభుత్వం అర్థం చేసుకుని మా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కుమారి, వర లక్ష్మి, ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చినుకు పడితే రోడ్లన్నీ చెరువులే..

ప్రజాశక్తి-గన్నవరం : శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మేకర్ పంచాయతీ గన్నవరం దళితవాడలో రోడ్లన్నీ నీటమునిగాయి. పల్లపు ఏరియాలో ఉన్న ఇల్లు ముంపు గురయ్యాయి. నివాసితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చినుకు పడితే చెరువును తలపించేలా , లోతట్టు ఇళ్ళలోకి నీరు చేరుతుందని కాలనీ వాసుల ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ముంపు సమస్య నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని

నీట మునిగిన రోడ్డు

విమర్శిస్తున్నారు. రోడ్లను అభివృద్ధి చేసి వర్షం నీరు నిలవకుండా చేయాలని కోరుతున్నారు.

కోడూరు మండల అభివృద్ధే ధ్యేయం

- ఎంపిపి కొండవీటి వెంకట కుమారి

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిషత్ అధ్యక్షురాలుగా నియమితులైన నాటి నుండి కూడా అనునిత్యం కోడూరు మండల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి తెలిపారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు వారి శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి ఎంపిటిసి సభ్యులకు, సర్పంచులకు వివరించారు. ఆర్ అండ్ బి ఏ ఈ భాను కిరణ్ మాట్లాడుతూ కోడూరు అవనిగడ్డ రోడ్డు కు సంబంధించి 35 కోట్ల రూపాయలు ఎస్టిమేట్లు తయారుచేసి పంపించడం జరిగిందని, ఆ ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఉందని, అతి త్వరలోనే నిధులు మంజూరు అయ్యి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కోడూరు ఊట గుండం రహదారి మరమ్మతులకు రెండు కోట్ల రూపాయల ను ప్రతిపాదనలు పంపామని, వి కొత్తపాలెం నుండి విశ్వనాథపల్లి రహదారి మరమ్మతులకు

మాట్లాడుతున్న ఎంపిపి వెంకటకుమారి

కోటి 50 లక్షల రూపాయలను ప్రతిపాదన పంపించినట్లు ఆయన తెలిపారు. ఈవోపీఆర్డి రాజనాల నాగ రేవతి మాట్లాడుతూ ఇంటి పన్నులను డిజిటల్ విధానాల్లో చెల్లించాలని, ఎక్కడ కూడా గ్రామపంచాయతీ సిబ్బందికి డబ్బులు ఇవ్వకూడదని, ఈ విధానం ఎంతో పారదర్శకంగా ఉంటుందని ఆమె అన్నారు. ఎంపీడీవో ఆకుల పాడు రంగారావు మాట్లాడుతూ కోడూరు మండలంలోని అందరు ఎంపిటిసి లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించే విధంగా కషి చేస్తామని, కోడూరు నుండి అవనిగడ్డ సాయంత్రం ఐదు గంటల 30 నిమిషాల తర్వాత బస్సు ఉండడం లేదని, దీనివల్ల ఉద్యోగస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆర్టీసీ అధికారుల దష్టికి తీసుకువచ్చారు. మత్స్యశాఖ అధికారి వానపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కోడూరు మండలంలో 6000 ఎకరాలకు పైగా ఆక్వా సాగు ఉందని, ఎవరికైతే పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయో వారందరి కూడా విద్యుత్ సబ్సిడీ మంజూరు అవుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తాసిల్దార్ ఎస్కే లతీఫ్ పాషా, మండల విద్యాశాఖ అధికారి రాందాస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజరాజేశ్వరి, ఇరిగేషన్, డ్రైనేజీ, ఏఈలు, విద్యుత్ శాఖ అధికారులు తోపాటు, పలు శాఖల అధికారులు పాల్గొనగా, వైస్ ఎంపీపీలు చేబోయిన లీలావతి, ముక్కు వెంకటేశ్వరరావు, పరిశె వెంకటేశ్వర్లు, బడే హేమ గంగాధర్ రావు, తిమ్మన వెంకట నాంచారయ్య, మీసాల రాణి నాంచారమ్మ, లంకె భాస్కరరావు, మందపాకల, పోటు మీద గ్రామ సర్పంచులు అద్దంకి శివప్రసాద్, పుప్పాల లక్ష్మీ కనకదుర్గ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : సెప్టెంబర్ 5న నిర్వహించుకునే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పరిష్కరించుకుని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందించేందుకు దరఖాస్తులు కోరుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తాహెర సుల్తాన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఇప్పటికే జిల్లాలోని అందరు ఉపవిద్యాశాఖాధికారులకు, మండల విద్యా శాఖాధికారులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు సంబంధించి విధివిధానాలు పంపించడం జరిగిందన్నారు. కావున ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు మీ పరిధిలోని ఉపాధ్యాయులకు సంబం దించిన దరఖాస్తులను సంచాలకులు, పాఠశాలవిద్య, ఆంధ్రప్రదేశ్, అమరావతి వారు జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం పరిశీలించి తగు సిఫారసులతో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారము ఈ నెల 31 వ తేదీ లోపు దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాదికారి వారి కార్యాలయంనకు అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు..

వైఎస్సార్ అచీవ్మెంట్ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి- ఉయ్యూరు : వైఎస్సార్ అచీవ్మెంట్ పురస్కారాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఉయ్యూరు ఇన్ చార్జ్ ఆర్డీవో నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం విలేకరుల స మావేశంలో మాట్లాడుతూ వివిధ అంశాలలో విశిష్ట ప్రతిభావంతులు, కళాకారులు, సే వాతత్పరులు ఈనెల 31లోగా రెవిన్యూ డివిజన్ పరిధిలో ఆయా మండల తహసిల్దార్ కార్యాలయాల్లో వారి పేర్లు నమోదుచేయించుకోవాలని తెలిపారు.

కశ్మీర్ ఫైల్స్కు అవార్డుపై అభ్యంతరం

ప్రజాశక్తి ఉయ్యూరు : 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాన్ని 69వ జాతీయ చలనచిత్ర అవార్డులలో జాతీయ సమైక్యతపై ఉత్తమ చలన చిత్రంగా నర్గీస్ దత్ అవార్డుకు ఎంపిక చేయడంపట్ల నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జమీల్ అహ్మద్ బేగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ది కశ్మీర్ ఫైల్స్' జాతీయ సమైక్యతను పెంపొందించే చిత్రమా అని శనివారం ఒక ప్రకటనలో జమీల్ అహ్మద్ బేగ్ ప్రశ్నించారు. ముస్లింలను, కశ్మీరీలను దుర్భాషలాడుతూ, విద్వేషాలను రెచ్చగొట్టేలా చిత్రీకరించిన ఈ కల్పిత చిత్ర ప్రదర్శన తర్వాత విద్వేష పూర్తి వాతావరణం ఏర్పడిరదన్నారు. కల్పిత కథతో నిర్మించిన చిత్రాన్ని ప్రధాని నరేంద్రమోడీ పెంచి పోషిస్తున్నారని, ఇటువంటి చిత్రాలను ప్రోత్సహించడమే ధ్యేయంగా పెట్టుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. విద్వేషాలను రెచ్చగొడుతూ సమాజంలో తప్పుడు అభిప్రాయాలను సష్టించే ఈ చిత్రానికి జాతీయ సమైక్యతా అవార్డును ప్రకటించడంపై ఆయన తీవ్ర అసంతప్తిని వ్యక్తం చేశారు. అది కూడా భిన్న మతాలకు, భిన్న భాషలకు నెలవైన భారత్లో ప్రజల మధ్య సమైక్యతకోసం విశేషంగా కషిచేసిన నర్గీస్దత్ పేరిట ఇచ్చే అవార్డుకు ఈ చిత్రాన్ని ఎంపిక చేయడాన్ని జమీల్ అహ్మద్ బేగ్ తీవ్రంగా విమర్శించారు

బాలికలకు బస్పాస్ల పంపిణీ

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : ఉంగుటూరు మండలం తేలప్రోలు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డికి సన్నిహితులు దివంగత నాయకులు వింత ప్రసాద్ రెడ్డి 20వ వర్ధంతి సందర్భంగా తేలప్రోలు లోని గ్రామస్తులకు పండ్లు, పలహారాలు పంచిపెట్టి, జడ్పీ హైస్కూల్లో వందమంది విద్యార్థులకు ఉచితంగా బస్సు పాస్ లను ఇచ్చారు. తేలప్రోలు ఉపసర్పంచ్ వింత ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిపారు. సర్పంచ్ లాం దిబోరా, పిఎసిఎస్ బ్యాంక్ చైర్మన్ తియ్యగూర రామిరెడ్డి, వింత గురవారెడ్డి, కొల్లి బసివి రెడ్డి, విశ్వనాథపల్లి రవికుమార్, గ్రామ నాయకులు కీర్తిశేషులు వింత ప్రసాద్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

మానవతా ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి

ప్రజాశక్తి - హనుమాన్ జంక్షన్ : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్ జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో మానవతా అధ్యక్షులు కూరెళ్ల సుబ్బాచారి ఆధ్వర్యంలో మదర్ తెరిసా జయంతి సందర్భంగా శనివారం ఆమె చిత్రపటానికి పూలమాల లు వేసి ఘన నివాళు లర్పించారు.

దుట్టాతో ఎంపి బాలశౌరి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అంతేగాక టిడిపి నియోజకవర్గ ఇన్చార్జిగా కూడా నియమితులయ్యారు. డాక్టర్ దుట్టా మాత్రం క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుత ఎంఎల్‌ఎ వంశీని, డాక్టర్ దుట్టాను కలిపితే వచ్చే ఎన్నికల్లో విజయం తథ్యమని భావించిన వైసిపి అధిష్టానం అనుగుణంగా వేగంగా పావులు కదుపుతోంది. నియోజకవర్గంలో బలమైన నేతగా ఉన్న యార్లగడ్డ వెంకట్రావు టిడిపిలో చేరిన నేపథ్యంలో దుట్టాను బుజ్జగించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈనేపథ్యంలో మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి శనివారం హనుమాన్‌జంక్షన్లోని డాక్టర్ దుట్టా నివాసానికి వచ్చారు. బాలశౌరితోపాటు గత కొంతకాలంగా దుట్టాకు దూరంగా ఉంటున్న వల్లభనేని వంశీ మోహన్ అనుచరులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా దుట్టా నివాసానికి వెళ్లారు. ఈసందర్భంగా డాక్టర్ దుట్టా, ఎంపి బాలశౌరి ఏకాంతంగా సుమారు గంటసేపు చర్చలు జరిపారు. చర్చల సారాంశాన్ని ఎంపి బయటికి చెప్పకపోయినప్పటికీ అంతిమంగా దుట్టాను మళ్లీ నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేలా చేయడమే లక్ష్యంగా కనిపిస్తోంది. టిడిపి నుంచి ఎంఎల్‌ఎ అభ్యర్థిగా విజయం సాధించి, అనంతరం అధికార వైసిపికి మద్దతు పలికిన వంశీతో దుట్టాకు విభేదాలు ఉన్నాయి. పార్టీ కార్యకర్తలకు న్యాయం చేసే విషయంలో వంశీతో ఆయన విభేదించారు. టిడిపి హయాంలో ఇబ్బందులు పడిన కార్యకర్తలు వైసిపి అధికారంలో ఉన్న సమయంలో సైతం ఇబ్బందులు పడుతున్నారని, పదవులు సైతం టిడిపి వారికే దక్కుతున్నాయని దుట్టా అసహనం వ్యక్తం చేసేవారు. వంశీ అక్రమ మైనింగ్, మట్టి తవ్వకాలు జరిపి అధికార పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని సిఎం కార్యాలయానికి దుట్టా ఫిర్యాదులు చేశారు. దీనిపై పార్టీ అధిష్ఠానం వైఖరిని నిరసిస్తూ పార్టీ క్రియాశీల రాజకీయాలకు దుట్టా దూరంగా ఉంటున్నారు. ముఖ్యమంత్రి జగన్ రెండుసార్లు నేరుగా వల్లభనేని వంశీతో కలిసి పనిచేయాలని చెప్పినా దుట్టా అంగీకరించలేదు. ఈ పరిణామాలు జరుగుతున్న సమయంలోనే గత ఎన్నికల్లో వైసిపి తరపున పోటీ చేసిన యార్లగడ్డ ఇటీవల గన్నవరం వచ్చిన నారా లోకేష్ పాదయాత్రలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అంతేగాక గన్నవరం నియోజవర్గ టిడిపి ఇన్చార్జిగా నియమితులయ్యారు. వచ్చే ఎన్నికల్లో యార్లగడ్డ టిడిపి తరపున బరిలో నిలవడం దాదాపు ఖాయమైనట్లే. యార్లగడ్డ బరిలో దిగితే వైసిపి తరపున ప్రస్తుత ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీ మోహన్ పోటీగా ఉంటారని ఆ రెండు పార్టీల శ్రేణులు అంచనా వేస్తున్నాయి. వైసిపి తరపున వంశీ బరిలో నిలిస్తే దుట్టాకు మద్దతుగా నిలిచే వైసిపి శ్రేణులు యార్లగడ్డకు సహకరిస్తాయని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారాన్ని దుట్టా వర్గీయులు ఖండించకపోగా, ఇటీవల గన్నవరం యార్లగడ్డ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన అనుచరులు సహకరించారనేది బహిరంగ రహస్యమే. గన్నవరంలో జరుగుతున్న పరిణామాలతో ఖంగుతిన్న వైసిపి అధిష్టానం దుట్టాను మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లో యాక్టివ్ చేయడం ద్వారా పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టింది. భోజనం చేసేందుకు దుట్టా నివాసానికి వచ్చానని ఎంపి బాలశౌరి మీడియాకు చెబుతున్నా, అంతర్గతంగా జరిగిన చర్చల సారాంశం మాత్రం దుట్టా మళ్లీ గన్నవరంపై దష్టి సారించేలా చేయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌కు తాను ఎప్పటికీ విధేయుడనే అని అంటున్న దుట్టా...వల్లభనేని వంశీతో కలిసి ముందుకు సాగేందుకు అంగీకరిస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. సుమారు ఏడాది పాటు దుట్టాను చూసీచూడనట్లు వదిలేసిన అధిష్టానం...యార్లగడ్డ వైసిపిని వీడిన తర్వాత ఆయనతో పలు దఫాలుగా చర్చలు జరిపినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ ఎంపి అయోధ్య రామిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకష్ణారెడ్డి ఫోన్లో దుట్టాతో చర్చలు జరిపినట్లు తెలిసింది. అయితే వంశీకి మద్దతు తెలిపే విషయంలో దుట్టా సైతం ఖచ్చితమైన హామీని అధిష్టానానికి ఇవ్వలేదని దుట్టా వర్గీయులు చెబుతున్నారు. తమ నాయకుని విలువ పార్టీ అధిష్టానానికి ఇప్పుడు తెలిసిందా వ్యాఖ్యానిస్తున్నారు. దుట్టాను గతంలో ఎంఎల్‌ఎ వంశీ మోహన్ నోటికొచ్చినట్లు మాట్లాడిన విషయాన్ని ఎలా మర్చిపోతామని అంటున్నారు. అయితే వంశీ విషయంలో తమ నాయకుడు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాము కట్టుబడే ఉంటామని స్పష్టం చేస్తున్నారు. ఏదిఏమైనా అధిష్టానం మాట విని డాక్టర్ దుట్టా వచ్చే ఎన్నికల్లో వంశీ విజయానికి కషి చేస్తారా లేదా అన్న విషయానికి కాలమే సమాధానం చెప్పాలి.

సిపిఎం అభిమాని రాధాకృష్ణ మృతి

ప్రజాశక్తి - గంపలగూడెం : సిపిఎం అభిమాని చావా రాధాకృష్ణ (రాధయ్య) (75) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. గంపలగూడెం మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాధాకృష్ణ గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర వరప్రసాద్, ఊటుకూరు గ్రామ సీనియర్ నాయకులు చెరుకూరి రాధాకష్ణమూర్తి, ఎస్‌జె చారి, మల్లవరపు కుటుంబరావు, గుంటుపల్లి వీరభద్రం తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాధయ్య పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని గుర్తుచేసుకున్నారు. పార్టీ కార్యక్రమాలను ముందుండి నడిపించేవారని వివరించారు. రాధాకృష్ణ మృతికి సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు, ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు బిఆర్.తులసీరావు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. గంలపగూడెం ప్రాంతంలో పార్టీ విస్తరణకు కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. నిబద్ధతతో పనిచేసేవారని వివరించారు. సిపిఎం మండల కార్యదర్శి గువ్వల సీతారాంరెడ్డి, మాజీ కార్యదర్శి బంక జాన్‌సుందర్రావు, మీసాల గోపాలకష్ణ, జానపాటి వెంకటేశ్వరరావు, మద్దిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు రాధాకృష్ణ మృతికి సంతాపం తెలిపారు. కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పట్టణపేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సహకారంతో విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఇంద్రకీలాద్రి పట్టణ సమాఖ్య వారు కేదారేశ్వర పేట పండ్ల మార్కెట్ వద్ద ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పశ్చిమ ఎంఎల్‌ఎ వెలంపల్లి శ్రీనివాస రావు హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్, ఎపిఐడిసి చైర్‌పర్సన్ బి.ఎన్.పుణ్యశీల, యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల పాల్గొన్నారు.

కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మిస్తున్నామని తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా జిల్లాలో ఇప్పటికే రెండు లక్షల 67 వేల 792 గృహాలకు కనెక్షన్లు పూర్తి చేశామని, 2024 డిశంబర్ 31నాటికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేస్తామని, వాటిలో 2024 మార్చి నెలాఖరు నాటికి 50 వేల గృహాలు, డిశంబర్ నాటికి మరో 54 వేల గృహాలకు కనెక్షన్లు మంజూరు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఏ కొండూరులోని కిడ్నీ ప్రభావిత తండాలకు కృష్ణా జలాలను అందించే విధంగా చేపట్టిన పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను కేశినేని కోరారు. ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు మాట్లాడుతూ నున్న, సూరంపల్లి, కొండపావులూరులోని జగనన్న లే అవుట్లలో శాశ్వత ప్రాతిపదికన నీటి సరఫరాకు ప్రణాళికను అమలుచేయాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గ్రామీణ, పట్టణ గృహాలకు సంబందించి జిల్లాకు మంజూరైన 83,485 గృహాలకు సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో జడ్‌పి సిఇఒ వి జ్యోతిబాస్, సబ్‌కలెక్టర్ అదితి సింగ్, డిఆర్‌డిఎ పీడీ కె శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జెడి ఎస్ నాగమణెమ్మ, ఎపిసిపిడిసిఎల్ ఎస్ఇ ఎ మురళీకృష్ణ, డిఎస్‌ఒ జి.మోహన్‌బాబు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ సుహాసిని, హౌసింగ్ పీడీ ఎం రజనీకుమారి, పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ఎ.సుధాకర్, ఇరిగేషన్ ఎస్ఇ టిజెహెచ్ ప్రసాదబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డి వెంకటరమణ, ఐసిడిఎస్ పీడీ జి ఉమాదేవి, ఎల్‌డిఎం కె ప్రియాంక, ఎన్‌హెచ్ ఎఐ ప్రాజెక్టు డైరెక్టర్ డివి నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు లింగాల, పెనుగంచిప్రోలు గ్రామాల సర్పంచ్‌లు కె.వేణుగోపాల్‌రెడ్డి, వేల్పుల పద్మకుమారి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **JAVVADI RAVITEJA** S/o **NAGESWARA RAO,** R/o D.No: 2-98, Morusumalli Village, Mylavaram Mandal, N.T.R District, I have Indian passport **No:U3267586.** In my passport my spouse name was wrongly mentioned as **RAGHAVENDRA PRANAV SAI JAVVADI** it is my son's name. Actually my spouse name is **JAVVADI NAGARANI**, as per my wife's Aadhar Card. Hereafter my spouse name will be called **JAVVADI NAGARANI** for all purposes.

VIJAYA INSTITUTE OF TECHNOLOGY FOR WOMEN

Enikepadu, Vijayawada-521108. (A.P) Phone: **0866-2844444** Cell: **80085 19444.** E-mail: vijayatechfw@gmail.com, www.vitw.in

College Code **VITW**

LIST OF VACANT SEATS UNDER CATEGORY-B BRANCH WISE

Applications are invited from the qualified candidates, who wish to apply for the following B.Tech Course Management Quota. admissions (B-Category) for the academic year 2023-24. Last date for submission 06.09.23.

	Branch	Total
AIM	ARTIFICIAL INTELLIGENCE AND MACHINE LEARNING	18
CSD	COMPUTER SCIENCE AND ENGINEERING (DATA SCIENCE)	18
CSE	COMPUTER SCIENCE AND ENGINEERING	36
ECE	ELECTRONICS AND COMMUNICATION ENGINEERING	24
EEE	ELECTRICAL AND ELECTRONICS ENGINEERING	9
INF	INFORMATION TECHNOLOGY	18

Date : 26-08-2023 Sd/- Secretary

SRK INSTITUTE OF TECHNOLOGY

AUTONOMOUS

Approved by AICTE & Affiliated to JNTU Kakinada - iso 9001:2015 Certified Institution
Enikepadu - Vijayawada - 521108. Ph: **2843839.** Email: srktech@gmail.com web: www.srkit.in

B.Tech. Category-B:Non-NRI Seats(Management Quota)-2023-24

Applications are invited from the qualified candidates, who wish to apply for the following B.Tech Course Management Quota. admissions (B-Category) for the academic year 2023-24. Last date for submission 06.09.23.

Branch	Total (B+C)
CIVIL ENGINEERING	9
ELECTRICAL & ELECTRONICS ENGINEERING	18
MECHANICAL ENGINEERING	9
ELECTRONICS AND COMMUNICATION ENGINEERING	36
COMPUTER SCIENCE & ENGINEERING	36
INFORMATION TECHNOLOGY	18
COMPUTER SCIENCE & ENGINEERING (CSD) (DATA SCIENCE)	18
COMPUTER SCIENCE & ENGINEERING (CSM) (ARTIFICIAL INTELLEGENCY & MACHINE LEARNING)	36
ELECTRONICS ENGINEERING (VLSI DESIGN AND TECHNOLOGY)	18

Integrated MBA (IMBA) - 60

Date : 26-08-2023 Sd/- Secretary

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ వీరవరపు గంగయ్య 2) వీరవరపు సూర్యనారాయణ, 3) నల్లూరి వెంకటేశ్వరరావు 4) నల్లూరి బసవలింగంల మకాం ఏపూరు గ్రామం, పెదపాడు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా వారి సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్స్ వారి పితామహుడైన వీరవరపు సీతయ్యగారికి హిందూ వారసత్వ చట్ట ప్రకారం వారసులుగా ఉండి 2006సం॥లో వారి పూర్వార్జితమైన దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని డిటో గ్రామ కాపురస్తులైన బొప్పూడి సత్యనారాయణ గారి భార్య సీతామహాలక్ష్మి గారికి దస్తావేజు నెం. 4875/2006 గా రిజిష్టర్ చేసి అమ్మకం జరిపి యున్నారు. ఆ సమయం నందు కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రము సంబంధిత ఎంఆర్‌ఓ కార్యాలయం నుంచి తీసుకొని వుండలేదు. కావున మేము జరిపిన పై తెలిపిన విక్రయం నిరాటంకంగా కొనసాగుటకు సదరు వీరవరపు సీతయ్యకు హిందూ వారసత్వం ప్రకారం మేమే వారసులమని, మరెవ్వరూ లేరని ఇందు మూలంగా తెలియజేయుచున్నాము. కావున మేము కాక ఇతరులు ఎవరైనా వుండి వుంటే ఈప్రకటన వెలువడిన వారం లోపు తెలియజేయ వలసినదిగా కోరటమైనది. తరువాత వచ్చు క్లయిమ్‌లు మమ్మల్ని బైండు చేయజాలవు.

షెడ్యూలాస్థి

పశ్చిమగోదావరిజిల్లా, పెదపాడు మండలం, ఏపూరు గ్రామ పంచాయతీ ఆర్.ఎస్.నెం. 133/2 నందు 339 చ॥గ॥ ఖాళీ స్థలమునకు హద్దులు.
తూర్పు : వీరవరపు సర్వేశలింగం గారి బజారు
దక్షిణం : పశివేదల నరసింహం గారి ఆస్తి
పడమర : వీరవరపు ముత్యాలు మరియు ఇతరులు
ఉత్తరం : పంచాయతీ బజారు

ఇట్లు
సయ్యద్ ఆరీఫ్
న్యాయవాది,
శ్రీ అపార్ట్‌మెంట్, ఐ.టి.ఐ. కాలేజి ఎదురు,
ఎల్‌ఐసి కాలనీ, విజయవాడ.
సెల్ : 9951438555

మహారాజశ్రీ విజయవాడ రెండవ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు, విజయవాడ

ఐ.పి. 18/2023

నండూరి రమాదేవి మరియు ఇతరులు
... పిటీషనర్లు
మరియు
గోచిపాత అప్పారావు మరియు ఇతరులు
.. రెస్పాండెంట్లు

ఇందుమూలముగా మహారాజశ్రీ పై కోర్టువారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా పై కేసును రెస్పాండెంట్-1 అనగా గోచిపాత అప్పారావు హాజరు కొరకు ది.28-08-2023 నాటికి వాయిదా వేసినారు. కావున సదరు పైన తెలిపిన గోచిపాత అప్పారావు ది. 28-08-2023 కోర్టుకు హాజరు కావల్సినదిగా ఇందుమూలముగా తెలియేయడమైనది. హాజరు కాని యెడల కేసును రెస్పాండెంట్-1 అయిన గోచిపాత అప్పారావుకు వ్యతిరేకంగా తీర్మానించెదరు.
వాయిదాతేది: 28-08-2023
ఉదయం 10-30 గం.లకు

ఇట్లు
కిరణ్‌బాబు తగరం, న్యాయవాది,
జి2, శ్రీ అపార్ట్‌మెంట్
ఐ.టి.ఐ. కాలేజీ ఎదురు,
ఎల్‌ఐసి కాలనీ, విజయవాడ-8.
సెల్ : 6300114939

ప్రకటన

నా క్లయింట్స్ కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, గ్రామ కాపురస్తులు 1) లేటు చోప్పా కృష్ణమూర్తి గారి భార్య రాజ్యలక్ష్మి 2) ఆవుల హనుమంతరావు గారి భార్య రజనీకుమారి 3) ఆవుల సాంబశివరావు గారి భార్య సుధారాణి వార్ల సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

మాలో 1వ వారికి భర్తగారు 2,3 వారలకు తండ్రి గారు అయిన చోప్పా కృష్ణమూర్తి గారు వారి పూర్వార్జితం ఆస్థిని మరియు దిగువ షెడ్యూల్ ఆస్తిని అనుభవించుచూ ఇంటెస్టేట్‌గా మరణించియున్నారు. సదరు కృష్ణమూర్తి గారికి మేము హిందూ వారసత్వ రీత్యా వారసులుగా పార్టీషన్ దస్తావేజు 2578/2014 రిజిష్టర్ చేసుకొని ఎవరి వాటాలు వారము యధేచ్ఛగా అనుభవించుచున్నాము. సదరు పార్టీషన్ సమయ మందు మేము సంబంధిత ఎంఆర్‌ఓ నుండి కుటుంబ సభ్యులు ధృవీకరణ పత్రం పొందియుండలేదు. కావున మేము జరిపిన పై పార్టీషన్ చట్టబద్ధత కొరకు మేమే చోప్పా కృష్ణమూర్తి గారికి వారసులమని, మేము తప్ప ఎవరైనా వుండిన యెడల ఈ ప్రకటన వెలువడిన నాటి నుండి వారం రోజులలోపు తెలియజేయగలరు. తదుపరి వచ్చు క్లయిమ్‌లు నా క్లయింట్‌ను ఏమాత్రం బైండు చేయజాలవు.

షెడ్యూలాస్థి

కృష్ణాజిల్ల, బాపులపాడు మండలం, కానుమోలు స.రి. ఇలాకా బాపులపాడు గ్రామ ఆర్.ఎస్.50 నందు 37 1/2 సెం॥లో దక్షిణం వైపు గల 10 సెంట్లలో 73 చ॥గజాల ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు.
తూర్పు : తోట రామకృష్ణ
దక్షిణం : పంచాయతీబజారు
పడమర : పంచాయతీ బజారు
ఉత్తరం : షేక్ మహబూబ్ బాషా, కాశీం.

ఇట్లు
సయ్యద్ ఆరీఫ్
న్యాయవాది,
శ్రీ అపార్ట్‌మెంట్, ఐ.టి.ఐ. కాలేజి ఎదురు,
ఎల్‌ఐసి కాలనీ, విజయవాడ.
సెల్ : 9951438555

ప్రకటన

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నగరం, కుదూస్ నగర్, డోర్ డోర్ నెం. 18-11-26/34 కింద తెలిపిన షెడ్యూల్ ఆస్తిని బంటిప్రోలు మండలం, వెల్లటూరు గ్రామ నివాసి యార్లగడ్డ సతీష్ S/o రాఘవేంద్రబాబు ఇపి నెం. 47/ 2016 ఇన్ ఓఎస్ 109/2013లో శ్రీ 2వ అదనపు జిల్లా న్యాయస్థానం విజయవాడ వారి ముందు వేలంలో సదరు. ఆస్తిని కొనుగోలు చేసి విక్రయ సర్టిఫికెట్ పొంది, దరిమిలా ఇపి. నెం. 12/2022 సదరు ఆస్తిని పొజీషన్‌తో స్వాధీనపర్చుకొని యున్నారు. ఈయొక్క ఆస్తిని నా క్లైంట్ అయిన మద్దిరాల హరికృష్ణ S/o మోహనరావు (లేటు) కుదూస్ నగర్, కేదరేశ్వర పేట, విజయవాడ వారు కొనుగోలు చేయుటకు సదరు ఆస్థిపై కోర్టువారి డిక్రీలు పొందివున్నా, ఏమైనా అభ్యంతరాలున్నా డాక్యు మెంటరీ ఆధారాలతో ది. 30-08-2023వ తేదిలోగా ఈకింది అడ్రస్‌కు తెలియజేయగలరు. తదుపరి ఎటు వంటి అభ్యంతరాలు వచ్చిననూ తమ క్లయింట్ కు ఎటువంటి సంబంధం ఉండదు.

స్థిరాస్తి షెడ్యూల్: ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నగరం, కుదూస్‌నగర్, అర్.ఎస్. నెంబర్ 30/1, 31/1 మున్సిపల్ డివిజన్ డోర్ నెంబరు 18-11-26/34 దాఖలా చ. గ.92.8 లు లేక చ.మీ. 77-59 స్థలము, స్థలములో గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ అర్ సిసి కట్టడము, సెకండ్ ఫ్లోర్ ఎసీసి రేకుల కట్టడముకు హద్దులు
తూర్పు: మున్సిపల్ రోడ్డు
దక్షిణం: మద్దిరాల హరికృష్ణ, రామకృష్ణ గార్ల అస్థికి మధ్య గల జాయింట్ గోడ
పడమర: ప్లాట్ నెం.50రు దాఖలా అస్థి
ఉత్తరం : మద్దిరాలా నరసింహారావు, వంశీకృష్ణ ఆస్థి

ఇట్లు
శీలం లెనిన్, న్యాయవాది,
4వ లైన్, ఎలక్ట్రిసిటీ కాలనీ,
ఆటోనగర్, విజయవాడ,
సెల్.9908873140

సమాజసేవకు జీవితాన్ని అంకితం చేసిన మదర్ థెరిస్సా

ప్రజాశక్తి - గుడివాడ : నిరుపేదలకు అమ్మగా, అనారోగ్యాల బారిన పడిన వారిని అక్కున చేర్చుకున్న గొప్ప మాతృమూర్తి, నోబుల్ బహుమతి అవార్డు గ్రహీత మదర్ థెరిస్సా అని జనసేన నాయకులు డాక్టర్ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. మదర్ థెరిస్సా 113వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక తుమ్మల రామబ్రహ్మం మున్సిపల్ పార్కులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఆర్‌డివో కార్యాలయం సమీపంలో పేదలకు అన్నదానం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ మీరా షరీఫ్, నూనె అయ్యప్ప, చరణ్ తేజ్, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.అలాగే ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి గద్దె పుష్ప రాణి, ఎంపిడిఒ డాక్టర్ అనగాని వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం, విద్యాశాఖ సిబ్బంది, పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఆపన్నులకు సేవలందిం చటంతో త్యాగమూర్తిగా చరిత్రలో మదర్ థెరిస్సా నిలిచి ఉంటారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మదర్ థెరిస్సా జయంతి వేడుకలను ఘంటసాల గ్రామంలోని పెద్దగూడెంలో శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎక్కడో యుగోస్లేవియాలో పుట్టి కోల్ కత్తా మురికివాడల్లో అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి మదర్ థెరిస్సా అన్నారు. నేటి తరం యువత ఆమెను ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. తొలుత జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద మదర్ దెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మదర్ థెరిస్సా సేవా సమితి ఫౌండర్ కొడాలి శ్యామ్యూల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నందేటి శ్రీనివాసరావు, దిరిశం పిచ్చేశ్వరరావు, దిరిశం శ్రీను, దిరిశం రాజు, కొడాలి వెంకటేశ్వరరావు, దొండపాటి యాకోబు, మట్టా కోటేషు, దిరిశం మహలక్ష్ముడు, దిరిశం పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** సమాజ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన మాతృమూర్తి మదర్ తెరిసా అని మానవతా స్వచ్ఛంద సంస్థ పూర్వపు అధ్యక్షులు పినమాల నాగ కుమార్ అన్నారు. శనివారం ఉయ్యూరు శాఖా గ్రంధాలయం నందు మదర్ థెరీసా జయంతి సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు పినమాల నాగ కుమార్ మాట్లాడుతూ ఎక్కడో వేరే దేశంలో పుట్టి మన భారత దేశానికి విచ్చేసి ఇక్కడ ఎందరో అభాగ్యులను అక్కున చేర్చుకున్న గొప్ప మనసున్న తల్లిగా వారిని ఆదరించి తన ఆఖరి శ్వాస ఉన్నంత వరకు తన జీవితాన్ని అనాధల సేవ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహోన్నత వ్యక్తి మదర్ థెరీసా అని కొనియాడారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉయ్యూరు శాఖ చైర్మన్ కొలసాని రవికుమార్,ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి శ్రీమతి బీవీ రమణి, సిబ్బంది కే స్రవంతి, నాయకులు ఎంజీ రవికుమార్, చాట్ల ప్రవీణ్, మట్టా హానోక్ తదితరులు పాల్గొని మదర్ థెరీసా చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** లయన్స్ క్లబ్ చల్లపల్లి విఆర్‌కెనగర్ ఆధ్వర్యంలో మదర్ తెరెస్సా జయంతి వేడుకలు చల్లపల్లిలోని ఆదరణ వద్ధాశ్రమంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వద్ధాశ్రమంలోని 25 మంది వద్ధులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు ప్రెసిడెంట్ ఎం. వెంకటేశ్వరరావు, సెక్రటరీ ఆర్. రాధాకష్ణ, కోశాధికారి ఎన్.సాయిబాబు, మాజీ అధ్యక్షులు ప్రసాద్, ముమ్మనేని నాని, తగిరిశ సాంబశివరావు పాల్గొన్నారు.

చల్లపల్లిలో...

ఘంటసాలలో..

గుడివాడలో...

శిక్షణా కేంద్రంలో ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్, అధికారులు, సభ్యులు

ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను వినియోగించుకోవాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-విజయవాడ : ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను వినియోగించుకొని స్వయం ఉపాధి పొంది మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సర్కిల్-2 పరిధిలోని 58వ డివిజన్ కమ్యూనిటీ హాలులో యుసిడి విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి మహిళా ఆర్థికంగా పురోగతి సాధించడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. దానిలో భాగంగానే ప్రతి సర్కిల్ పరిధిలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఆరు మాసాలు శిక్షణ ఇచ్చి, రకరకాల డిజైన్లు కుట్టే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రతి మహిళా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి అయిన తరువాత సర్టిఫికెట్స్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఒ యుసిడి కె శకుంతల, సర్కిల్ 2 సి డి ఓ జి.జగదీశ్వరి, విఎంసి టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ ఫణి, రమ్య, , సోషల్ వర్కర్ శ్రీకాంత్, శిక్షణ తీసుకుంటున్న మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు కచ్చితంగా పాఠశాలలో ఉండాలని, బడిబైట ఉండకూడదని పమిడిముక్కల మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. శని వారం ఆయన మండ లంలోని ఐనపూర్ ఉన్నత పాఠశాలను పరిశీ లించారు. ఈసంద ర్భంగా గరికే సుబ్ర హ్మణ్యం అనే విద్యార్థి పాఠశాలకు సరిగా హాజరు కాకపోవడంతో అతని ఇంటికి వెళ్లి తీసుకుని పాఠశాలకు తీసుకొచ్చారు. అనంతరం పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బడిబైట ఉండకూడదని, అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవా లన్నారు. అలాగే సోమవారం నుంచి జరిగే కాంప్లెక్స్ సమావే శాలకు ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

జీవన నైపుణ్యాలే బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - భవానీపురం : విద్యార్థుల భవిష్యత్తును ఆనంద మయం చేయడానికి జీవన నైపుణ్యాలు, ప్రణాళికా, నైపుణ్యాలు ఎంతగానో దోహదం చేస్తాయని ప్రముఖ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్, సాఫ్ట్ స్కిల్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్, బిహేవియర్ తెరపిస్ట్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ - భారత ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సర్టిఫైడ్ ట్రైనర్ అయిన జగదీష్ అన్నారు. శనివారం వన్‌టౌన్ కొత్తపేటలో గల పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జున రావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలోని ఎన్.ఎస్.ఎస్ యూనిట్ విభాగ ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్ మరియు వ్యక్తిత్వ వికాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జగదీష్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక ఆరోగ్యం, మానసిక వికాసానికి, విద్యాభివద్ధికి దోహదం చేస్తుందన్నారు. కెరీర్ గైడెన్స్ అనేది విద్యా శిక్షణ మరియు వత్తిపరమైన ఎంపిక చేయడంలో సహాయం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన అవసరం

- ప్రముఖ న్యూరో ఫీజీషియన్ డాక్టర్ ఎం.సౌమ్య

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : బ్రెయిన్ స్ట్రోక్ విషయంలో అత్యవసర చికిత్స అందిస్తే రోగి చాలా తేలికగా త్వరగా కోలుకుంటాడని, బ్రెయిన్ స్ట్రోక్‌కి కారణాలు, లక్షణాలు గురించి అవగాహన అత్యంత అవసరమని ప్రముఖ న్యూరో ఫీజీషియన్ డాక్టర్ ఎం.సౌమ్య అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల వాసవ్యనర్సింగ్ హోమ్‌లో శనివారం 'ప్రమాదకర నీడా మండల పరిస్థితులు - చికిత్స' అనే అంశంపై ఆరోగ్య సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సౌమ్య మాట్లాడుతూ అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి రక్తప్రసరణలో అడ్డంకులు ఏర్పడటం ఒక ప్రధాన కారణమన్నారు. నాలుగు గంటల్లోగా రక్తపు గడ్డలు కరగడానికి ఇంజక్షన్ ఇచ్చినట్లయితే రోగి పక్షవాతం నుండి తేలికగా కోలుకోవడం ఉంటుందని తెలిపారు. చాలా మంది బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినపుడు ఏవేవో వైద్యాలు చేస్తూ ఆలస్యం చేస్తారన్నారు. మెదడుకు సంబంధించిన ఎమర్జన్సీలో బ్రెయిన్ స్ట్రోక్ ఒక్కటే కాకుండా ఫిట్స్ వ్యాధిగా పేర్కొనే ఎమర్జన్సీ వ్యాధి కూడా వస్తుందన్నారు. సడన్‌గా తల తిరగడం, భరించలేనంత తలనొప్పి రావడం, చూపు మందగించడం, కాళ్లు, చేతులు రెండు చచ్చుబడటం, అంతా అయోమయంగా అనిపించడం వంటివి కూడా ఉంటాయని తెలిపారు. మెదుడుకి సంబంధించిన అత్యవసర పరిస్థితులకు వెంటనే చికిత్స చేయకపోయినట్లయితే ప్రతి ఒక్క నిముషానికి 1.9 మిలియన్ నాడీ కణాలు డ్యామేజీ అవుతాయన్నారు. అదే విధంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినపుడు సరైన చికిత్స వెంటనే అందించపోయినట్లయితే ప్రతి గంటకీ 3.6 సంవత్సరాల వయసు తరగిపోతుందన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినపుడు కాళ్లు, చేతులు చచ్చుబటటమే కాకుండా ముఖంగాని, శరీర భాగాలు గాని స్పర్శ తెలియకుండా అవడం ఉంటుందన్నారు. మనస్సంతా గందరగోళంగా ఉంటుందన్నారు. సరిగా లేవకపోవడం, శరీరం బ్యాలెన్స్ తప్పినట్లు అవడంగాని, ఉంటాయని తెలిపారు. మెదుడుకి సంబంధించిన ఎటువంటి లక్షణాలు అయినా ఆకస్మాత్తుగా కనపడినపుడు వెంటనే అత్యవసర చికిత్స అందించాలన్నారు. అలాగే అవసరమైన వారికి ఎంఆర్ఐ వంటి పరీక్షలు వెంటనే చేయించాలనానరను. మెదడుకు సంబంధించిన అత్యవసర పరిస్థితులను ఎట్టి పరిస్థితులలోనూ నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. ఈకారక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం అధ్యక్షత వహించగా, డాక్టర్ మారు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

సబ్ జోన్ ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఆవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో అవనిగడ్డలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న అవనిగడ్డ సబ్ జోన్ ఆటల పోటీలను శనివారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనడం ద్వారా శారీరక దఢత్వం మానసిక ఉల్లాసం కలుగుతాయని చెప్పారు. దీంతోపాటు క్రీడల్లో రాణిస్తే జాతీయ ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుందని దీనితో మంచి భవిష్యత్తు ఉన్నతమైన జీవితం లభిస్తుందన్నారు. అదేవిధంగా పోటీ తత్వం పెరిగి విజయం సాధించాలని సంకల్పం ఏర్పడుతుందన్నారు. గెలుపు వాటములను తేడాస్ఫూర్తితో స్వీకరించాలని ఎమ్మెల్యే సూచించారు. అవనిగడ్డ సబ్ జోన్ పరిధిలో జరిగే ఈ పోటీలలో అవనిగడ్డ నాగాయలంక కోడూరు మోపిదేవి చల్లపల్లి ఘంటసాల మువ్వ మండలాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. తొలి రోజు జరిగిన పోటీలలో లాంగ్ జంప్ లో అవనిగడ్డ నారాయణ విద్యాసంస్థలు చెందిన చాణిక్యవర్ధన్ మొదటి స్థానం సాధించగా, కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కే సుబ్రహ్మణ్యం ద్వితీయ స్థానం సాధించగా, పులిగడ్డ ఏపీ ఆర్ ఎస్ విద్యార్థి కే నవనీత్ తతీయ స్థానం సాధించాడు. డిస్కస్ త్రో లో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సిహెచ్ లోకేష్ ఎం. ఆకాష్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించగా, లింగారెడ్డి పాలెం జడ్.పి.హెచ్.ఎస్ కు చెందిన ఏ దీవెన బాబు తతీయ స్థానం సాధించాడు. షాట్ పట్ లో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎన్ జై దేవ్ ప్రథమ స్థానం సాధించగా, పులిగడ్డ ఏ పీ ఆర్ ఎస్ సి విద్యార్థి ఎం స్టెపెన్ బి మణికంఠ ద్వితీయ తతీయ స్థానాలు సాధించారు. 800 మీటర్ల పరుగు పందెంలో పులిగడ్డ ఏపీ ఆర్ ఎస్ సి విద్యార్థులు కే మణికంఠ ఎన్ అక్షయ్ కుమార్ ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించగా, నాగాయలం క కు చెందిన జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థి ఎన్ అక్షయ్ కుమార్ తతీయ స్థానం సాధించారు. కాగా కబడ్డీ పోటీలలో కోడూరు జడ్పీహెచ్ఎస్ పులిగడ్డ ఏపీ ఆర్ ఎస్ సి విద్యార్థులు ఫైనల్ పోటీకి చేరుకున్నారు. ఈ పోటీలను ఏడు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు.

ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్ బాబు

లాభాల్లో లింకన్ ఫార్మా కంపెనీ వృద్ధి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ ఔషద కంపెనీలలో ఒకటైన లింకన్ ఫార్మాస్యూటికల్స్ వెయ్యి కోట్లకు పైగా క్యాపిటలైజేషన్ సాధించిందని సంస్థ ప్రతినిధి ఎం.ఎస్. కుమార్ తెలిపారు. నగరంలోని ఫార్మా సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. రాబోయే సంవత్సరాల్లో కూడా ఆదాయం, లాభాల్లో ఆరోగ్యకరమైన వృద్ధిని కొనసా గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. నికర రుణ రహిత హోదాను కొనసాగిస్తూనే 2026 ఆర్థిక సంవత్సరం నాటికి రు. 750 కోట్ల ఆదాయాన్ని సాధించాలన్నది కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. వచ్చే మూడేళ్లలో ఈప్లాంట్ నుండి సుమారు రూ.150 కోట్ల అమ్మకాలు అవుతాయన్నారు. రానున్న కాలంలో కంపెనీ ప్లానింగ్‌ను సమర్ధవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

మెషీన్ లెర్నింగ్ సమ్మర్ స్కూల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అమెజాన్ మెషీన్ లెర్నింగ్ సమ్మర్ స్కూల్ మూడవ ఎడిషన్‌ను ప్రారంభించినట్లు అమెజాన్ సంస్థ ఉపాధ్యక్షులు రాజీవ్.ఆర్. ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు కీలకమైన మెషీన్ లెర్నింగ్ సాంకేతికతలను నేర్చుకుని మెషీన్ లెర్నింగ్ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పింఆలనే ఉద్దేశంతోనే ఈసమ్మర్ స్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈకోర్సు సెప్టెంబరులో నాలుగు వారాల పాటు ఉచిత ఎడ్యుకేషన్ కోర్సుగా ఎనిమిది మాడ్యూళ్లతో అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇది విద్యార్థులకు కమ్యూనికేషన్‌స్కిల్స్‌ను పెంపొందించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పిస్తుందన్నారు. దీని ద్వారా విద్యార్థులకు రానున్న కాలంలో చక్కటి ఉపాధి అవకాశాలు పొందడంతో పాటు, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు ఉంటుందన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న పలువురు బ్యాంకు సిబ్బంది

పేదలకు బ్యాంకింగ్ సేవలు సులభతరం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పేద ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేయడమే తమ లక్ష్యమని పీపుల్స్ మ్యాచ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్ చుక్కపల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. తమ బ్యాంకు ఆధ్వర్యంలో పేద సామాన్య మధ్యతరగతి ప్రజలకు రుణాలు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం లయోళా కాలేజీలోని దేవయ్య ఆడిటోరియంలో పీపుల్స్ క్రెడిట్ సొసైటీ మహాజన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్యాంకు ఖాతాదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ తమ సంస్థ స్థాపించి 10 పదేళ్ల పూర్తయిందని ఈ పదేళ్ల కాలంలో పేద ప్రజలకు సామాన్య మధ్య తరగతి ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేశామని తెలిపారు. పలు రకాల లోన్లను అతి తక్కువ వడ్డీతో అందజేస్తూ ఖాతాదారుల మనలను పొందగలిగామని ఆయన పేర్కొన్నారు. సొసైటీ ట్రెజరర్ జ్యోత్స్న 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రాఫిట్ అండ్ లాస్ అకౌంట్, బ్యాలెన్సు షీటు మరియు ఇతర ఆర్థిక పరమైన అంశాలను సభలో ప్రవేశ పెట్టారు. ఆమె మాట్లాడుతూ 2022- 23 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ రూ.2,37,76,388/- లాభాన్ని గడించిందన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మాజీ డైరెక్టర్ జి.వి.సాంబశివ రావు, పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ విజయవాడ శాఖ చైర్మన్ ఏ.ఎల్లారావు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి కే కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్, తదితరులు

సురక్షా క్యూ ఆర్ ద్వారా నిరంతర వైద్య సేవలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అత్యాధునిక వైద్య సహాయాలు నిరంతరం ప్రజలందరికీ అందించేందుకు సురక్షా క్యూఆర్‌ను తీసుకురావడం గర్వకారణం అని గుంటూరు డిప్యూటీ మేయర్ షేక్ సాజీలా తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో డాక్టర్ సేవలు నిరంతరం అందించేందుకు సురక్షా క్యూఆర్ ఆవిష్కరణ సభను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు డిప్యూటీ మేయర్, ఏడవ డివిజన్ వైసిపి కార్పొరేటర్ షేక్ సాజీల ముఖ్యఅతిథిగా విచ్చేసి సురక్ష క్యు ఆర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... అందరికీ అందుబాటులో వైద్యం అందించాలని ఉద్దేశంతో ఈ సురక్ష క్యు ఆర్ సంస్థ మంచి నిర్ణయంతో ఈ సురక్ష క్యు ఆర్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయ మన్నారు. తదనంతరం ఆంధ్రప్రదేశ్ ఫ్రాంచైజర్ వంశీ మాట్లాడుతూ.....డాక్టర్ సేవలు నిరంతరం అందించేందుకు సురక్షా క్యూఆర్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. 650 రుపాయలకే సంవత్సరం పాటు టెలీ కన్సల్టేషన్ పొందొచ్చన్నారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. లక్ష రుపాయలు ఇన్సూరెన్స్‌తో పాటు అత్యవసర సమయంలో 5 వేల రుపాయల అంబులెన్స్ ఖర్చు కూడా పొందవచ్చని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తాకినేని పద్మావతి, కంచర్ల శ్రీకాంత్, విద్యాసాగర్ రెడ్డి, తుమ్మల చంద్రశేఖర్, వేమూరి వెంకట్రావు, సుబ్బారాయుడు, మణిదీప్, అవినాష్, ప్రముఖులు పాల్గొన్నారు

క్రమం తప్పుతున్న స్థాయి సంఘం

ప్రతి నెల రోజులకు ఒక సారి జరుగుతున్న విజయవాడ నగరపాలక సంస్థ స్థాయి సంఘం సమావేశాలు క్రమం తప్పుతున్నట్లుగా, పలు విమర్శలకు తావిస్తున్నట్లుగా ఉందని పలువురు సీనియర్ కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక అజెండా రూపకల్పన దగ్గర నుంచి స్థాయి సంఘం సభ్యులకు అజెండాను అందజేసే దగ్గర నుంచి దీనిపై సమావేశంలో జరుగుతున్న చర్చ, తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజామోదంగా లేకపోగా, వ్యక్తిగతమైనవిగా ఉంటున్నాయనే దిశగా చర్చ లేకపోలేదు. సెక్రటరీ సెల్ ద్వారా నిర్దేశించిన గడువులోగా సభ్యులకు అజెండాను అందజేస్తే దానిపై స్టడీ చేయడం, సమావేశంలో ప్రతి అంశంపై చర్చించడం జరుగుతుందని, కానీ సమావేశం జరగబోయే సమయానికి ముందు గంటల వ్యవధిలోనే అజెండా చేతికొస్తే ఎలాగని పలువురు సభ్యులు సైతం విస్మయం వ్యక్తం చేస్తుండటం సర్వసాధారణమైందనడం గమనార్హం. రూల్ ప్రకారం/యాక్ట్ ప్రకారం అజెండాలోకి సబ్జెక్ట్‌లను ఎంపిక చేయడం, సమగ్రంగా చర్చించడం జరగాలి. ప్రియాంబుల్స్ అంటే ఏమిటి, రూల్, లేదా యాక్ట్, స్థాయి సంఘం నిబంధనలు తదితర అంశాలపై సభ్యులకు కనీస అవగాహన కూడా ఉండటం లేదనే చర్చ జరగడమే గాక, ఆ దిశగా సభ్యులను ట్రైనప్ చేయాలనే ఆలోచన పాలకవర్గానికి ఉండటం లేదని ప్రస్తుతం సభ్యుల తీరును బట్టి తెలుస్తుంది. వీటన్నింటిపై అధికారపార్టీ ఎప్పటికప్పుడు చెకప్ చేయాల్సి ఉన్నప్పటికీ, ఏ విధమైన బాధ్యతా తీసుకున్నట్లు కనిపించడం లేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే కౌన్సిల్, స్థాయి సంఘం సమావేశాలు జరుగుతున్న తీరు, సభ్యుల వ్యవహారంపై అధికార పార్టీ పట్టించుకోకుండా వదిలేసిందనే విమర్శ విపక్షాల నుంచే గాక, స్వయంగా అధికార పార్టీ నుంచి వినిపిస్తుంది. దీంతో స్థాయి సంఘం సమావేశాలు కొంత గాడి తప్పుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి మూడు మాసాలకు (90రోజులకు) ఒక సారి కౌన్సిల్స్ జరుగుతుండగా, ఈ కౌన్సిల్ వచ్చిన తరువాత నెలకు ఒక సారి స్థాయి సంఘం సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో ప్రతి గురువారం నాడు స్థాయి సంఘం సమావేశం జరగగా, గత మేయర్ కోనేరు శ్రీధర్ కాలంలో ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశం జరిగేది. కానీ ప్రస్తుతం ఈ కౌన్సిల్ కాలంలో నెలకు ఒక సారి సమావేశం జరుగుతుంది. అవసరాన్ని బట్టి, లేదా ఉన్న అంశాల ఆధారంగా ఒక్కొక్క సారి 20 రోజులకు కూడా నిర్వహిస్తున్న పరిస్థితి లేకపోలేదు. మునిసిపల్ పాలనా వ్యవస్థలో అత్యంత విలువైన, ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశాలను ఈ స్థాయి సంఘం సమావేశంలో చర్చిస్తారు. మేయర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా ఆర్థిక పరమైన అంశాలను చర్చకు పెట్టి, ఆమోదించడమో లేదా తిరస్కరించడమో జరుగుతుంటుంది. ఎస్టేట్‌కు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్‌ల లీజులు, రెవెన్యూ, ఆస్తి పన్నులు, పార్కింగ్ ప్రదేశాల లీజులకు సంబందించి దీనిలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. అలాగే రూ.ఐదు లక్షల లోపు అంచనా విలువ కల్గిన అత్యవసరంగా చేసిన వర్క్సకు సంబంధించి కౌన్సిల్‌కు రాకుండా మేయర్ నుంచి ముందస్తు (ర్యాటిఫై) అనుమతి పొందడానికి నసంబంధించిన అంశాలపై ఇక్కడ చర్చ జరిగి ఆమోదించుకోవడం జరుగుతుంటుంది. ఆయా డివిజన్లలో ప్రత్యేకంగా, అత్యవసరంగా రూ. పది లక్షలు, 15 లక్షలు చొప్పున చేపట్టాల్సిన వర్క్సకు సంబంధించి సమావేశంలో చర్చించి, మేయర్ ర్యాటిఫై చేస్తారు. ఈ నెల 21న జరిగిన స్థాయి సంఘం సమావేశంలో 11 అంశాలు రాగా, అన్ని అంశాలను ఆమోదించడం జరిగింది. అలాగే దీనికి ముందు జరిగిన సమావేశంలో కూడా అత్యధిక అంశాలను ఆమోదించడం జరుగుతుంది. కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి, అక్కడ సమగ్రంగా చర్చించి, ఆ తరువాత చేయించాల్సిన వర్క్సను సైతం అత్యవసరం పేరుతో బిట్లు, బిట్లుగా చేసి, రూ. ఐదు లక్షలలోపు వర్క్స అంటూ స్థాయి సంఘంలోనే ఆమోదించుకుంటూ వాటిని చేయిస్తున్న తీరు పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 21న జరిగిన స్థాయి సంఘం సమావేశంలో రూ.ఐదు లక్షలలోపు నామినేషన్ పద్ధతిలో ఆమోదం పొందిన 54 అత్యవసర పనులను ఆమోదించడం గమనార్హం. ఇదే రీతిలో ప్రతి సర్కిల్ పరిధిలో కోట్లాది రూపాయల అంచనా విలువ కల్గిన వర్క్సను సైతం విభజించి, వాటిని అత్యవసర పనులంటూ నామినేషన్ పద్దతిలో ఆమోదించేసుకుంటున్నారు. ఇటువంటి విధానం కాకుండా ప్రజాస్వామిక పద్దతిలో, రూల్/యాక్ట్ ప్రకారంగా అజెండా రూపకల్పన, సమగ్రమైన చర్చ జరిగి, ఎటువంటి విమర్శలకు తావులేకుండా స్థాయి సంఘం సమావేశాలు నిర్వహించాలని సీనియర్లు వ్యక్తం చేస్తున్నారు.

- రాజు

విద్యార్థులకు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించటంతో పాటు పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తపేట బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్ చెప్పారు. ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వారోత్సవాలను పాఠశాల శ్రీనాధాంధ్ర భాషా సమితి ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగు ఖ్యాతిని నలుదిశల వ్యాపింపజేసిన ప్రముఖులు, కవుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. అదేవిధంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 50 మొక్కలను పంపిణీ చేసి వాటి పరిరక్షణ బాధ్యతలు చేపట్టాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే. శ్రీనివాసరావు చెప్పారు. భాష వ్యామోహాని వీడి మాతృభాషను సంరక్షించుటలో విద్యార్థులు చిన్నతనం నుంచే కషి చేయాలన్నారు. విద్యార్థినిలు తెలుగు సాంప్రదాయ వంటకాలు తయారుచేసి పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. తెలుగు ఉపాధ్యాయులు కే. శ్రీనివాస్, డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు, డాక్టర్ కె. కృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఉపాధ్యాయుల ప్రతినిధి చిట్టా రాజశేఖర్, సీనియర్ ఉపాధ్యాయులు జే. ఆనంద్ కుమార్, ఎం సువర్ణ కుమార్, చెక్క జితేంద్ర కుమార్, అనసూయ, శశికళ, డీకే రంగమని తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ తెలుగు వంటకాలను చేసిన విద్యార్థినులతో బ్యాంక్ మేనేజర్, పాఠశాల ఉపాధ్యాయులు

మ్రికంద వెడ్డింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : చేనేతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చేనేత వస్త్రాలకు అధిక ప్రాధాన్యమిచ్చి యువ ఔత్సాహిక వ్యాపారవేత్తలు నల్లూరు చరిత, నల్లూరు కోమల అభిరామి నగరంలో వెడ్డింగ్ ఎక్సిబిషన్ ను ఏర్పాటు చేయడం అభినందనీయం అని వై.ఎస్. ఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. నల్లూరు మాధవి లతా, నల్లూరు కోమల అభిరామి, నల్లూరు చరిత ఆధ్వర్యంలో నగరంలోని గురునానక్ రోడ్ ఎన్. ఏ. సి కల్యాణ వేదికలో మ్రికంద లగ్జరీ వెడ్డింగ్ ఎక్సిబిషన్ సీజన్ వన్ ను ఏర్పాటు చేసారు. రెండు రోజుల ఈ ప్రదర్శనను హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, కష్ణా జిల్లా జెడ్పి మాజీ ఛైర్మెన్ గద్దె అనురాధ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ రాధికారెడ్డి మాట్లాడుతూ చరిత, అభిరామి చిన్న వయసులో వ్యాపారవేతలుగా మారడం అభినందనీయం అన్నారు. మహిళలు విద్య, ఉద్యోగాల్లో రాణిస్తున్నారని, వ్యాపార రంగంలో కూడా చక్కటి స్టార్ట్ అప్స్ మొదలు పెడుతున్నారని అన్నారు. ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత వస్త్ర వ్యాపారులు ప్రదర్శనలో పాల్గొని ప్రదర్శించిన ఉత్పత్తులు ఆకట్టుకున్నాయన్నారు. గద్దె అనురాధ మాట్లాడుతూ మారుతున్న ట్రెండ్‌కు కాలానికి అనునుగుణంగా వస్త్రధారణలో కూడా మార్పు వచ్చిందని, శుభకార్యాల్లో థీమ్స్‌కు తగ్గట్లు వస్త్రాలను ధరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ట్రెండ్ కు తగ్గట్లు వస్త్రాలు, ఆభరణాల ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు. చేనేత వస్త్రాలు నేసేవారిని ప్రోత్సహించిందేకు, వారి కళకు గుర్తింపు తీసుకొచ్చేలా, వారికి జీవనోపాధి కల్పించేలా చేనేత వస్త్రాల స్టాల్స్ ను ఏర్పాటు చేశారన్నారు. చరిత, కోమల అభిరామి మంచి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, మరింత మందికి ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు.

ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న మహిళలు

క్యాంటీన్‌లో ఆహారం పరిశీలిస్తున్న వెలంపల్లి, తదితరులు

క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : పట్టణపేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సహకారం తో విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని ఇంద్రకీలాద్రి పట్టణ సమాఖ్య వారు కేదారేశ్వర పేట పండ్ల మార్కెట్ వద్ద ఆహార క్యాంటిన్‌ను స్థానిక కార్పొరేటర్, ఎపిఐడిసి చైర్‌పర్సన్ బండినాగేంద్ర పుణ్యశీలతో కలిసి ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఇంటి తరహ ఆహార పదార్దాలను పేదలకు సరసమైన ధరలలో అందించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు మహిళలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ఆహ కాంటీన్ పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ కె శకుంతల, ఇంద్రకీలాద్రి పట్టణ సమాఖ్య అఫీస్ బేరర్స్ ,మెప్మా సిబ్బంది స్వయం సహాయక సంఘ మహిళలు , రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.